ప్రజాశక్తి
బుధవారం 25 జూన్ 2025
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

మెట్రోకు లైన్ క్లియరేనా ?

◆ మొదటి దశ 46.23 కిలోమీటర్ల రూట్ మ్యాప్ సిద్ధం

◆ భూ సేకరణ చెల్లింపులకు తక్షణం ఇవ్వాల్సింది రూ.600 కోట్లు

◆ ప్రాజెక్టు కోసం ఎఐఐబి నుంచి రావాల్సింది రూ.6057 కోట్లు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఎపి విభజన హామీల్లో విశాఖకు అత్యంత ప్రధానమైనవి రైల్వే జోన్, మెట్రో రైల్ ప్రాజెక్టులు. ఏళ్ల తరబడి ఈ ప్రాజెక్టులు ప్రజల కలగానే మిగిలిపోతున్నాయి. తాజాగా కూటమి ప్రభుత్వం మెట్రో ప్రాజెక్టును పూర్తిచేసి తీరుతామని చెబుతోంది. ఇటీవల కాలంలో మెట్రో ప్రతిపాదిత స్థలాలను అధికారులు పరిశీలించడం అందుకు ఊతమిస్తున్నా నిధుల సమస్య మాత్రం అలానే ఉంది.

మెట్రో ప్రతిపాదిత స్థలాలను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్ ఫొటో)

మెట్రో రైల్ అధికారులు, లైన్ల సర్వే, భూముల సర్వేకు సంబంధించిన సాంకేతిక సిబ్బంది గడచిన 20 రోజులుగా వైజాగ్ స్టీల్‌ప్లాంట్ మొదలుకొని కొమ్మాది వరకూ తొలి దశ మెట్రో రైల్ ప్రాజెక్టు క్లియరెన్స్ కోసం క్షేత్రస్థాయిలో పర్యటనలు చేస్తున్నారు. వారి పరిశీలనలో తొలి దశకు 99 ఎకరాలు భూమి అవసరమని తేలింది.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భూమి అందుకు సిద్ధంగా ఉండటం ఆశాజనకమైన విషయం. ప్రభుత్వం మెట్రో పట్ల చిత్తశుద్ధితో ఉన్నట్టయితే ఎలినేషన్ ఇవ్వడం సులభమే కాగలదు. ప్రైవేట్ భూమి కేవలం 9 ఎకరాలే ఉన్నా చాలా అడ్డంకులను తొలగించుకుంటూ మెట్రో విషయంలో ముందుకు సాగాల్సి ఉంటుందని మెట్రో రైల్ ఉన్నతాధికారులు తాజాగా 'ప్రజాశక్తి'కి తెలిపారు. 90 ఎకరాల్లో విశాఖపట్నం పోర్టు భూములు కూడా ఉండడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి వీటికి సంబంధించిన క్లియరెన్స్ రావాల్సి ఉంది.

ఎంత అవసరం? ఏం జరుగుతోంది?

ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఎఐఐబి) నిపుణుల బృందం ఇటీవలే విశాఖ మెట్రో గురించిన క్షేత్రస్థాయి పరిశీలన చేసి వెళ్లింది. ఎఐఐబి నుంచి రాష్ట్ర ప్రభుత్వం రూ.6057 కోట్లు నిధులను ఈ తొలి దఫా మెట్రోకు రాబట్టాల్సి ఉంది. ప్రాజెక్టుకు సంబంధించి కన్సల్టెంట్‌లు కొద్దిమంది వచ్చినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వంతో వారు చర్చలు జరిపారని తెలుస్తోంది. ఫైనల్‌గా ఒక కన్సల్టెంట్‌ను ప్రభుత్వం ఈ పనులకు పురమాయించాల్సి ఉన్నప్పటికీ అది ఇంకా జరగలేదు. తొమ్మిది ఎకరాల ప్రైవేట్ భూమి విషయంలో లబ్ధిదారుల నుంచి వ్యతిరేకత రాకుండా కూడా చూడాల్సి ఉంది. భూ సేకరణ కోసం వైజాగ్ మెట్రో రైలు అధికారులు తక్షణం మిగతా 2లో..

అభివాదం చేస్తున్న అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

కార్మిక హక్కులను కాలరాస్తే ఊరుకోం

◆ విశాఖ అఖిలపక్ష కార్మిక సంఘాలు ప్రకటన

◆ జూలై 9 అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని పిలుపు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కార్మిక హక్కులను కాలరాస్తే ఊరుకునేది లేదని, కార్మిక చట్టాలను మార్చి నాలుగు లేబర్ కోడ్స్‌ను ముందుకు తెచ్చి అమలుకు పూనుకుంటే తీవ్ర ప్రతిఘటన తప్పదని విశాఖ జిల్లా అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జూలై 9న జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. మంగళవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో కార్మిక సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి కార్మికులకు నష్టం చేసే విధానాలను అవలంబిస్తోందన్నారు. సంపదనంతా కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతోందని విమర్శించారు. అందులో భాగంగానే 29 కార్మిక చట్టాలను మార్చి కార్మికులకు నష్టం చేసే విధంగా నాలుగు లేబర్ కోడ్స్‌ను తీసుకువచ్చిందన్నారు. అవి అమలు జరిగితే కార్మికులు సమ్మె చేసే హక్కు, సంఘం పెట్టుకొనే హక్కు, జీతభత్యాలు బేరం ఆడుకునే ప్రాథమికమైన హక్కులు కోల్పోతారన్నారు. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలకు మిగతా 2లో..

రైల్వే సేవలు మెరుగుపరచాలి

▶ వార్త 2లో..

ఒక్క ఆధార్.. 16 కరెంట్ మీటర్లకు లింక్

▶ వార్త 3లో..

ఈస్ట్‌కోస్ట్ రైల్వే ఎజిఎంగా శ్రీకృష్ణ రాజ్‌కుమార్

▶ వార్త 2లో..

5న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వచ్చే నెల 5న జాతీయ లోక్ అదాలత్ విశాఖపట్నంలో జరుగుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు చిన్నంశెట్టి రాజు తెలిపారు. మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశం కొత్త కోర్టు బిల్డింగ్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌ను వాదులు, ప్రతివాదులు, కక్షిదారులు, బ్యాంకింగ్ సెక్టార్ వారు, ప్రభుత్వ అధికారులు ఇలా ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ లోక్ అదాలత్ జిల్లాలోగల అన్ని కోర్టుల్లో జరుగుతుందన్నారు. రాజీపడదగ్గ క్రిమినల్, సివిల్, ప్రీ లిటిగేషన్ కేసులను రాజీ చేసుకోవాలన్నారు. ఎక్కువ కేసులను పరిష్కరించుకోవడానికి అందరూ సహకరించాలన్నారు. ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి రాధా రత్నం, రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి గాయత్రి దేవి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు, డిసిపి క్రైమ్ మాధవీలత, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంకె.శ్రీనివాస్ మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారానికి ఆస్కారముందన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీస్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ఇన్సూరెన్సు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాజు

అంతులేని విషాదం

◆ లంకెలపాలెం జంక్షన్ వద్ద లారీ బీభత్సంలో నేటికీ 16 మంది పరిస్థితి ఆందోళనకరం

◆ అనకాపల్లిలో మిన్నంటిన మృతుల కుటుంబీకుల రోదనలు

కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిలో క్షతగాత్రుడు

ప్రజాశక్తి - పరవాడ, అనకాపల్లి రూరల్, గాజువాక విలేకరులు

జివిఎంసి 79వ వార్డు లంకెలపాలెం జంక్షన్ వద్ద సోమవారం రాత్రి అతివేగంతో వెళ్లిన ఓ లారీ సృష్టించిన బీభత్సంలో నేటికీ 16 మంది పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. ఈ ఘటనలో అనకాపల్లి మండలం రేబాకకు చెందిన పచ్చికూర గాంధీ (47), అనకాపల్లి రింగురోడ్డు ప్రాంతానికి చెందిన కొణతాల అచ్చియ్యనాయుడు (55), విశాఖ జిల్లా అగనంపూడికి చెందిన కె.యర్రప్పడు (35) అక్కడికక్కడే మృతిచెందిన విషయం తెలిసిందే. ఆరోగ్యం బాగోలేని స్నేహితున్ని పరామర్శించడానికని విశాఖలోని ఆసుపత్రికి వెళ్లి కారులో తిరిగి వస్తుండగా గాంధీ, అచ్చియ్యనాయుడు మృత్యువాతపడ్డారు. ఫార్మాసిటీ విధులు ముగించుకొని ఇంటికి వెళ్లేందుకు ఆగగా లారీ ఢీకొనడంతో యర్రప్పడు మృతిచెందాడు. వారి మృతదేహాలను అనకాపల్లిలోని ఎన్‌టిఆర్ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించగా అక్కడ మృతుల బంధువుల రోధనలు మిన్నంటాయి.

ఎన్‌టిఆర్ ఆసుపత్రి వద్ద రోధిస్తున్న మృతుల బంధువులు

అసలేం జరిగిందంటే..

పరవాడ మండలంలోని లంకెలపాలెం జాతీయ రహదారి కూడలి వద్ద సోమవారం రాత్రి సిగ్నల్ పడింది. దీంతో వాహనాలన్నీ ఆగాయి. ఆ సమయంలో గాజువాక నుంచి అనకాపల్లి వైపు ఓ లారీ మితిమీరిన వేగంతో వచ్చి ముందు ఆగి ఉన్న మూడు కార్లు, ఆరు ద్విచక్ర వాహనాలను ఢీకొడుతూ దూసుకుపోయింది. అదే సమయంలో పరవాడ వైపు నుంచి వస్తున్న భారీ కంటైనర్‌ను, ఒక కారును, జీపును, నాలుగు బైకులను ఢీకొని మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

మెట్రోకు లైన్ క్లియరేనా ?

రూ.600 కోట్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్లు తెలుస్తోంది. 46 కిలోమీటర్ల పరిధిలో స్టేషన్‌లు, లిఫ్ట్‌లు, ఎస్కలేటర్‌ల కోసం అక్కడక్కడా కొన్ని సెంట్ల భూమిని కూడా మెట్రో రైల్ లైన్‌కి ఇరువైపులా సేకరించాల్సి ఉందని, ఇది కొంచెం కష్టమైన పనే అని తెలుస్తోంది. తాజాగా డిజైన్ చేయబడ్డ మెట్రో రైల్ మ్యాప్‌లో ఆంధ్రా యూనివర్శిటీ స్టేషన్ దగ్గర అటు, ఇటు మెట్లు (ఎస్కలేటర్లు) రాబోతున్నాయి. ప్రయాణికులు రెండు వైపులా ఎంట్రీ, ఎగ్జిట్ అయ్యేలాగ ఈ పని జరగేలా మెట్రో అధికారులు ఇక్కడ కూడా కొన్ని సెంట్ల భూమిని సేకరించాల్సి ఉంటుందని చెబుతున్నారు. మెట్రో రైల్ పనులను స్వీకరించడానికి వచ్చిన కన్సల్టెంట్లను ఫైనల్ చేసి వర్క్ ఆర్డర్‌లు ఇచ్చే పని రాష్ట్ర ప్రభుత్వానిదే. ఈ ప్రక్రియను తక్షణం పూర్తిచేస్తేగానీ భూ సేకరణకు రూ.600 కోట్లు విడుదలయ్యే పరిస్థితి ఉండదని తెలుస్తోంది. మెట్రో పనులకు ఎప్పుడు మోక్షం కలుగుతుందో చూడాల్సిందే.

కార్మిక హక్కులను కాలరాస్తే ఊరుకోం

తక్కువ లేకుండా చెల్లించాలని, స్టీల్ ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, తొలగించిన నాలుగు వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, అసంఘటిత రంగ కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ, ఇన్సూరెన్స్‌తో కూడిన సమగ్ర చట్టం చేయాలని, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని, స్థానికులకు 75 శాతం ఉపాధి కల్పించాలని కోరారు. ఇపిఎస్ పెన్షన్‌దారులకు కనీస పెన్షన్ రూ.9 వేలు చెల్లించాలని, ఇంటి పనివారిని కార్మికులుగా గుర్తించి సమగ్ర చట్టం చేయాలని కోరారు. పై డిమాండ్లను నెరవేర్చుకునేందుకు సమ్మె జరుగుతోందన్నారు.

సమ్మె సన్నద్ధ కార్యక్రమాలు ఇలా..

సమ్మె సన్నద్ధకంగా ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకు కార్మికుల పని ప్రదేశాలలో, నివాస ప్రాంతాలలో విస్తారంగా కరపత్రాలు పంపిణీ చేయాలని, జూలై 1 నుంచి 4 వరకు అన్ని పరిశ్రమల వద్ద గేట్ మీటింగులు నిర్వహించాలని, 5న నగరంలో జివిఎంసి నుంచి బైక్ యాత్ర నిర్వహించాలని, 7న పారిశ్రామిక ప్రాంతంలో బైక్ ర్యాలీ చేపట్టాలని, 9న నగరంలో దొండపర్తి రైల్వే డిఆర్ఎం ఆఫీస్ నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు భారీ కార్మిక ప్రదర్శన జరపాలని సమావేశంలో నిర్ణయించారు. యావత్ కార్మిక వర్గం ఈ సమ్మెలో పాల్గొనాలని, ఆటో, ఇతర మోటారు కార్మికులు ఆ రోజు వాహనాలు నిలుపుదల చేసి బంద్ పాటించాలని పిలుపునిచ్చారు. అనంతరం సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.మన్మధరావు, ఐఎన్‌టియుసి జిల్లా కార్యదర్శి ఈశ్వరరావు, సిఎఫ్‌టియుఐ అఖిల భారత అధ్యక్షులు ఎన్.కనకారావు, ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, ఎపిఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి కె.దేవా, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ కెఎం.శ్రీనివాస్, కో-కన్వీనర్లు జ్యోతీశ్వరరావు, కుమార్ మంగళంతో పాటు ఎఐటియుసి సీనియర్ నాయకులు ఎస్‌కె.రెహమాన్ పాల్గొన్నారు.

అంతులేని విషాదం

ఆగిపోయింది. ఈ ఘటన రాత్రి 11 గంటల సమయంలో జరిగింది. ఒక్కసారిగా ఇంత బీభత్సం చోటుచేసుకోవడంతో అంతా భీతిల్లారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. లారీ డ్రైవర్‌ను అరెస్టు చేశామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని పరవాడ సిఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు.

క్షతగాత్రుల వివరాలివీ..

ప్రమాదంలో గాయపడ్డ అనకాపల్లి గవరపాలెం వాసి కర్రి అప్పారావు అనకాపల్లిలోని ఉషా ప్రైమ్ ఆసుపత్రిలోనూ, అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం నిందుకొండి గ్రామానికి చెందిన అడిగర్ల సత్తిబాబు, కాశీ గిరిధర్, విశాఖ జిల్లా గొల్లలపాలెంనకు చెందిన జోగ షణ్ముక, కోన వెంకటేష్, అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం సంతపాలెం గ్రామానికి చెందిన ఆర్.అప్పలరాజు ఎన్‌టిఆర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లాకు చెందిన డి.దుర్గారావు, విజయనగరం జిల్లా బొండపల్లి మండలం రయింద్రం గ్రామానికి చెందిన టి.శేఖర్, విశాఖ జిల్లా తగరపువలసకు చెందిన లక్కోజు ధనుంజయ, విజయనగరం జిల్లా చీపురుపల్లికి చెందిన పల్లెద సతీష్, విశాఖ జిల్లా కూర్మన్నపాలెంనకు చెందిన చెరుకూరి మధుబాబు, అనకాపల్లి దుర్గాలమ్మ వీధికి చెందిన ఎస్.రవికుమార్, కొణతాల మహాలక్ష్మి నాయుడు షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిలోనూ, విజయనగరం జిల్లా గంట్యాడ మండలానికి చెందిన కర్రి నాయుడు వడ్లపూడిలోగల పవన్ సాయి ఆసుపత్రిలోనూ, అనకాపల్లి జిల్లా రావికమతం మండలం కొత్తకోటకు చెందిన సలాపు రామ్‌కుమార్ కెజిహెచ్‌లోనూ, టి.శేషు మెడికవర్ ఆసుపత్రిలోనూ చికిత్స పొందుతున్నారు.

ఈస్ట్‌కోస్ట్ రైల్వే ఎజిఎంగా శ్రీకృష్ణ రాజ్‌కుమార్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే అదనపు జనరల్ మేనేజర్‌గా బి.శ్రీకృష్ణ రాజ్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇండియన్ రైల్వే సర్వీస్ ఆఫ్ ఇంజినీర్స్ 1989 బ్యాచ్ అధికారి. రైల్వే ఇంజినీరింగ్ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో మూడు దశాబ్దాలకుపైగా అనుభవాన్ని కలిగి ఉన్నారు. ఈ నియామకానికి ముందు ఆయన తూర్పు కోస్తా రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్‌గా పనిచేశారు.

జర్నలిజం స్కూల్ చైర్మన్‌గా నాగేశ్వరరావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఇండియా (ఎన్‌యుజెఐ)కు చెందిన స్కూల్ ఆఫ్ జర్నలిజం అండ్ కమ్యూనికేషన్ చైర్మన్‌గా నగరానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ నాగనబోయిన నాగేశ్వరరావు (ఎన్.ఎన్.ఆర్) ఎన్నికయ్యారు. ఈ నెల 22 న జరిగిన స్కూల్ గవర్నింగ్ బాడీ సమావేశంలో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నాగేశ్వరరావును చైర్మన్‌గా సభ్యులు ఏకగ్రీవ తీర్మానంతో ఎంపిక చేశారు.

రైల్వే సేవలు మెరుగుపరచాలి

సమావేశంలో పాల్గొన్న రైల్వే డిఆర్ఎం లలిత్ బోహ్రా, సభ్యులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వాల్తేరు డివిజన్ వినియోగదారుల సంప్రదింపుల కమిటీ (డిఆర్‌యుసిసి) ఈ ఏడాది తొలి సమావేశం మంగళవారం ఉదయం విశాఖలోని డిఆర్ఎం సమావేశ మందిరంలో జరిగింది. డిఆర్ఎం లలిత్ బోహ్రా ఆధ్వర్యాన సాగిన ఈ కార్యక్రమంలో విశాఖపట్నం దక్షిణ ఎమ్మెల్యే సిహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్, వాణిజ్యమండలి, పరిశ్రమలు, సాంస్కృతిక సంఘాలు, గుర్తింపు పొందిన ప్రయాణికుల సంఘాలు, ఆసక్తిగల కార్మిక సంఘాల ప్రతినిధులతో పాటు పార్లమెంట్ సభ్యులు నామినేట్ చేసినటువంటి ప్రతినిధులు పాల్గొన్నారు. తొలుత లలిత్ బోహ్రా మాట్లాడుతూ భారతీయ రైల్వే అందించే సేవలను మెరుగుపరచడంలో సహాయ పడటానికి విలువైన సూచనలు, సలహాలు, అభిప్రాయాలు తెలియజేయాలని ప్రతినిధులను కోరారు.

వారు స్పందిస్తూ వికలాంగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, వారికి ప్రత్యేక భోగీలు ప్రవేశపెట్టాలని, సాధారణ రైళ్లను పెంచాలని కోరారు. నూతన రైళ్లకు పేర్లు పెట్టాలన్నారు. అదనపు ప్లాట్‌ఫారాలు, షెల్టర్ల నిర్మాణం చేపట్టాలన్నారు. రైలు ప్రయాణికుల సమస్యలను డిఆర్ఎం దృష్టికి తీసుకొచ్చారు. వాటి పరిష్కారానికి ఆయన హామీ ఇచ్చారు.

29న విశాఖ అభివృద్ధి, నిధులు, సంస్కరణలపై సదస్సు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్: విశాఖపట్నం అభివృద్ధి, నిధులు, సంస్కరణలు అనే అంశంపై ఈ నెల 29న అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు, అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ప్రొగ్రామ్ ఇన్‌చార్జి జి.రాజేశ్వరరావు తెలిపారు. మంగళవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదస్సులో సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ సైన్సెస్ విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ సి.రామచంద్రయ్య, విజయవాడ ఎంబివికె చైర్మన్ పి.మధు, ఎ.వి. పట్టణ పౌరసమైఖ్య సిహెచ్ బాబురావు,సిపిఐ జివిఎంసి ఫ్లోర్ లీడర్ ఎ.జె స్టాలిన్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, సిపిఎం జివిఎంసి ఫ్లోర్‌లీడర్ డాక్టర్ బి.గంగారావు, ఎన్.ప్రకాశరావు(వార్వా), పి.నారాయణ మూర్తి (నివాస్) ప్రసంగిస్తారని తెలిపారు. రాష్ట్రంలో అతిపెద్ద నగరమైన విశాఖపట్నం రాష్ట్ర విభజన తర్వాత ఎటువంటి అభివృద్ధికి నోచుకోకపోగా ఉన్న ఐటి పరిశ్రమలు తరలిపోయే పరిస్థితి నెలకొందన్నారు. విశాఖపట్నం అభివృద్ధి, ప్రస్తుత పరిస్థితి, ఏ చర్యలు చేపడితే నిజమైన అభివృద్ధి జరుగుతుందన్న అంశాలను చర్చించడానికి ఉద్దేశించబడిన ఈ సదస్సుకు విశాఖ పౌరులు పెద్ద సంఖ్యలో హాజరై, జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అల్లూరి విజ్ఞాన కేంద్రం ప్రొగ్రాం కమిటి సభ్యులు బుజ్జి, సిహెచ్ సత్యనారాయణ, విల్లాజీ, టి.కామేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యలపై ఎంటిఎస్ ఉపాధ్యాయుల ధర్నా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: ఎంటిఎస్ ఉపాధ్యాయులకు న్యాయం జరిగే వరకూ కౌన్సిలింగ్ నిలిపివేయాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్,విద్యాశాఖ కమిషనర్ చొరవ తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఎంటిఎస్ 2008, 1998 జెఎసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పిఆర్‌టియు జిల్లా నాయకులు నాగేశ్వరరావు, వెంకటపతిరాజు మాట్లాడుతూ, రెండేళ్లుగా ఏజెన్సీలో పనిచేసిన తమను మళ్లీ సాధారణ బదిలీలలో ఏజెన్సీకే పంపిస్తున్నారని ఇప్పటికే 98 మంది ఎంటిఎస్ ఉద్యోగులను మైదాన ప్రాంతాల బదిలీ చేస్తామని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారన్నారు. ఏజెన్సీలో ఉద్యోగాలు చేస్తూ తరచూ అనారోగ్యాలకు గురై వైద్య ఖర్చులు పెట్టుకోలేక ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

కాలుష్యం నుండి కాపాడతా..

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజవర్గంతో పాటు,నగరంలో కాలుష్యాన్ని నివారించవలసిన బాధ్యత తనపై ఉందని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. కాలుష్య నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టి, 2,3 సంస్థలతో చర్చించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. జిల్లా పరిషత్ జంక్షన్ లోని సెయింట్ జోసఫ్ ఓల్డేజ్ హోం, అమెరికన్ హాస్పిటల్‌కు వేదాంత ఫౌండేషన్ సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన 8 కెవి సోలార్ ప్యానెల్ ను మంగళవారం ఆయన ప్రారంభించారు.

జిల్లా కలెక్టర్‌ను కలిసిన జివిఎంసి కమిషనర్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జివిఎంసి) కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కేతన్ గార్గ్ మంగళవారం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్‌ను తన ఛాంబర్లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జివిఎంసి కార్యకలాపాలు, పరిపాలనాపరమైన అంశాలపై చర్చించుకున్నారు. సుమారు గంటన్నర సేపు భేటీ అయిన వారిద్దరూ జిల్లా స్థితిగతులు,ఇతర అంశాలపై మాట్లాడుకున్నారు.

సమాచార శాఖ డిడి కూడా..

సమాచార పౌరసంబంధాలశాఖ విశాఖపట్టణం కార్యాలయ ఉప సంచాలకులుగా బాధ్యతలు స్వీకరించిన కె.సదారావు మంగళవారం కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు, జర్నలిస్టుల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలు, అక్రిడిటేషన్ వ్యవహారాలు, ఇతర అంశాల్లో అనుసరించాల్సిన విధానాలపై కలెక్టర్ పలు సూచనలు చేశారు. సమన్వయంతో వ్యవహరించాలని, స్నేహపూర్వక వాతావరణంలో పని చేసుకోవాలని సూచించారు.

డిజైనింగ్ రంగంలో నిట్టె సంస్థతో అవకాశాలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: నిట్టె ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నడపబడుతున్న నిట్టె స్కూల్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ అండ్ ఇంటీరియర్ డిజైన్ సంస్థ ద్వారా ఫ్యాషన్ టెక్నాలజీ ఇంటీరియర్ డిజైనింగ్ రంగాల్లో విస్తృత అవకాశాలు కల్పిస్తోందని జస్టిస్ కేఎస్ హెగ్డే అన్నారు. మంగళవారం విశాఖలోని ఒక ప్రైవేటు హోటల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 1979లో నిట్టె ఎడ్యుకేషన్ ట్రస్ట్ స్థాపించామని, ఈ ట్రస్ట్‌కు ప్రస్తుతం మూడు క్యాంపస్లు 44 సంస్థలు కలిగి 160కి పైగా కార్యక్రమాలు నిర్వహించిందని తద్వారా 27 వేల మంది విద్యార్థులకు 5500 మంది అధ్యాపకులకు తోడ్పాటు అందిస్తుందని ఆయన తెలిపారు.

నేర నియంత్రణకు పోలీస్ అవుట్ పోస్టులు దోహదం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: నేర నియంత్రణకు పోలీస్ ఔట్‌పోస్ట్‌లు దోహద పడతాయని వెస్ట్ సబ్ డివిజన్ ఎసిపి పథ్వీ తేజా అన్నారు. జ్ఞానాపురం రైల్వే స్టేషన్ ఔట్ గేట్ ఆర్చ్ వద్ద కంచరపాలెం పోలీసులు ఏర్పాటు చేసిన పోలీస్ ఔట్‌పోస్ట్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ రైల్వే స్టేషన్ పరిసరాల్లో నేరాలు నివారించేందుకు పోలీస్ ఔట్‌పోస్ట్ ఉపయోగకరంగా ఉంటుందన్నాను.

IN THE HONOURABLE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE, AT VIZIANAGARAM
O.S.NO.498/2015

Between:
Mohammad Akbar Sharif .....Plaintiff
And:
M.Abdul Hameed (died) and others ......Defendants

To
R-7: Rashida Khateen, d/o M. Abdul Hameed, r/o door no.23-8-12, Hukumba Street, I Town Police Station Area, Visakhapatnam.

Hearing date:08-07-2025
NOTICE

Please take notice that the above case stands posted to 08-07-2025 before the above court for your appearance. So, you are hereby required to present before the Honourable Court on **dt.08-07-2025 at 10.30 A.M** either personally or through your Advocate, failing which the matter will be decided in your absence basing on the available record.

T.V.SRINIVASA RAO
Advocate,
Vizianagaram.
Ph.no.9440192479

ఒక్క ఆధార్.. 16 కరెంట్ మీటర్లకు లింక్

లింక్ అయిన మీటర్ నెంబర్లను చూపిస్తున్న శ్రీనివాస్

ప్రజాశక్తి- ఆనందపురం : పెద్దిపాలెం పంచాయతీ పరిధి మచ్చవానిపాలెం గ్రామానికి చెందిన కోరుకొండ శ్రీనివాసరావుకు కరెంటు మీటర్ లేదు. కానీ ఆయన ఆధార్ నెంబర్‌తో 16 మీటర్లు ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. 'తల్లికి వందనం' పథకం నిధులు రాలేదని శ్రీనివాసరావు సంబంధిత సచివాలయాన్ని సంప్రదించగా, విద్యుత్ వినియోగం 300 యూనిట్లు మించడంతో అనర్హుల జాబితాలో చేరినట్లు అధికారులు తెలిపారు. తనకు కరెంటు మీటరే లేదని, ఇన్ని కనెక్షన్లు ఎక్కడి నుంచి వచ్చాయని ఆయన విద్యుత్ శాఖ కార్యాలయానికి, సచివాలయానికి తిరుగుతూ తన ఆవేదన వెలిబుచ్చారు. దీనిపై పరిశీలించగా ఆయన ఆధార్ నంబర్‌తో మొత్తం 16 విద్యుత్ కనెక్షన్లు లింక్ అయి ఉన్నట్లు వివరాలు బయటపడ్డాయి. దీనిపై ఆఫీసు చుట్టూ తిరుగుతున్నా సమస్యకు పరిష్కారం కనిపించడంలేదని ఆయన వేదన వ్యక్తం చేశారు. శ్రీనివాసరావు ఆధార్ నంబర్ (2394 7327 1882)కు లింకైన విద్యుత్ సర్వీస్ నంబర్లు 116410పి003000070, 116410పి003000347, 116410ఎ004000540, 116410ఎ004000546, 116410ఎ004000541, 116410ఎ004000358, 116410ఎ004000595, 116410పి011000038, 116410పి011000433, 116410పి011000106, 116410పి011000413, 116410బి009000627, 116410బి009000704, 116410బి009000758, 116410బి009000885, 116410బి009000929 సర్వీస్ నెంబర్లు ఆనందపురం, పాలవలస, వేములవలస, పెద్దిపాలెం ప్రాంతాల్లో వినియోగంలో ఉన్నట్లు విద్యుత్ శాఖ రికార్డులు చూపిస్తున్నాయని బాధితుడు పేర్కొన్నారు. తనకు కరెంట్ మీటరే లేకపోతే ఇన్ని మీటర్లు తన ఆధార్‌కు ఎలా లింక్ అయ్యాయోనని బాధితుడు వాపోతున్నారు. ఇలా అయితే తల్లికి వందనం మాత్రమే కాదు, ఏ ప్రభుత్వ పథకానికీ అర్హత లేకుండా పోతుందంటూ శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. తల్లికి వందనం పథకం కింద నిధులు జమకాని వారు ఈ నెల 26వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉన్నందున విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించాలని బాధితునితో పాటు గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి -మధురవాడ : పిఎం.పాలెం పోలీసుస్టేషన్ పరిధిలో గంజాయితో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు సిఐ జె.బాలకృష్ణ తెలిపారు. పనోరమహిల్స్ మెయిన్ గేటు ఎదురుగా రోడ్డుపైన వెస్ట్ బెంగాల్‌కు చెందిన అక్తర్ రషీద్‌ను 1.5 కిలోల గంజాయితోపాటు పట్టుకున్నట్లు పేర్కొన్నారు. అతనిని విచారించగా పనోరమహిల్స్‌లోని డివిఎల్ 66 విల్లాలో అద్దెకు నివాసముంటున్న ఆదిల్ ఆసిఫ్ తన ద్వారా గంజాయి కొనడం అమ్మడం చేయిస్తున్నాడని తెలిపాడని వివరించారు. అక్తర్ రషీద్‌ను మంగళవారం రిమాండ్‌కు పంపించారు. ఆదిల్ ఆసిఫ్‌ను అరెస్టుచేయ్యాల్సి ఉందని తెలిపారు.

పలు ప్రయివేటు విద్యాసంస్థల్లో చోరీ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నంలోని ప్రగతి జూనియర్ కళాశాల, ఎంఎల్ఎఎస్ డిగ్రీ కళాశాల రెండు విద్యాసంస్థల్లో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దాదాపు రూ.5 లక్షల వరకు నగదు చోరీ జరిగినట్లు ఆయా విద్యా సంస్థల ప్రతినిధులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు, అమేరకు సిఐ గోవిందరావు క్లూస్ టీమ్‌ను రంగంలోకి దించి ఆధారాలు సేకరిస్తున్నారు, కాలేజీల్లో అడ్మిషన్ టైం కావడంతో దొంగతనాలకు పాల్పడినట్లు తెలిసింది, దొంగతనాలు జరిగిన విద్యాసంస్థల వద్ద ఎటువంటి సిసి కెమెరాలు ఏర్పాటు చేయకపోవడంతో సమీపంలోని సీసీ కెమెరాలు ఆధారంగా చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు.

గ్రావెల్ తవ్వకాలపై అధికారుల తనిఖీ

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ఆనందపురం : ఆనందపురం మండలం చందక పంచాయతీ పరిధి జగ్గరాజుపాలెం సర్వే నంబరు 4లో గ్రావెల్ అక్రమ తవ్వకాల ప్రాంతాలను అధికారులు మంగళవారం పరిశీలించారు. 'గ్రావెల్ దందా!' శీర్షికన ప్రజాశక్తిలో మంగళవారం ప్రచురితమైన కథనానికి, స్థానికుల ఫిర్యాదుకు అధికారులు స్పందించారు. ఆనందపురం మండల ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ చేతన్ కుమార్ ఆదేశాలతో ఆర్ఐ అవినాష్, సర్వేయర్ గణేష్ మంగళవారం ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. తవ్వకాల స్థితిగతులపై పూర్తి స్థాయి నివేదికను జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పంపిస్తామని వారు తెలిపారు. ప్రకృతి సమతుల్యతను దెబ్బతీసే ఈ చర్యలను వెంటనే నిలిపివేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు

పరిశీలిస్తున్న అధికారులు

పిహెచ్‌సి వైద్యాధికారిగా లీలాప్రసాద్

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని రేవిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా లీలాప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనకాపల్లి జిల్లా కెజె.పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పని చేసిన వైద్యాధికారి స్వప్న భీమిలి మండలం ఆర్.తాళ్లవలస వైద్యాధికారిగా బదిలీపై వెళ్లారు.

ఉపాధ్యాయ బదిలీలు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని 22 గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న 49 ప్రాథమిక పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయుల బదిలీలు జరిగినట్లు పద్మనాభం మండల విద్యాశాఖాధికారి పి.రమణ తెలిపారు. మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు 14 మంది ఇతర మండలాలకు బదిలీపై వెళ్లారని, ఇతర మండలాల నుంచి 22 మంది ఉపాధ్యాయులు పద్మనాభం మండలానికి వచ్చారని వివరించారు. వీరితో పాటు మండల స్థాయిలోనే 28 మంది ఉపాధ్యాయులకు బదిలీలు జరిగాయని తెలిపారు. ఈ ఏడాది మంచి ఫలితాల కోసం ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. ప్రయివేటు పాఠశాలలకు దీటుగా విద్యా బోధన జరిగేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

రైతు బజార్ అదనపు రహదారికి స్థల పరిశీలన

ప్రజాశక్తి-కొమ్మాది : జివిఎంసి 5వ వార్డులోని రైతు బజార్ దగ్గర నిత్యం వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడంతో స్థానిక కార్పొరేటర్ మొల్లి హేమలత భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లడంతో చినగదిలి మండల తహశీల్దార్ పాల్ కిరణ్, జివిఎంసి జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి మంగళవారం రైతుబజార్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టిడిపి బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, ఈఈ శాంతిరాజు, ఎఇ శ్రీనివాసరావు, మండల సర్వేయర్, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ ప్రాంతంలో జనాభా రోజు రోజుకూ పెరగడం వల్ల ట్రాఫిక్ సమస్య కూడా పెరుగుతోంది. ముఖ్యంగా రైతు బజార్ దగ్గర ఆఫీసులకు, రోజువారీ పనులకు, పాఠశాలలకు వెళ్లే వారు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కార్పొరేటర్ మొల్లి హేమలత ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు మంగళవారం అధికారులు పరిశీలించారు.

ఎండాడ చెరువు సుందరీకరణకు గంటా ఆదేశం

ప్రజాశక్తి-మధురవాడ : ఎండాడ చెరువు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జివిఎంసి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎండాడ చెరువును సందర్శించిన ఆయన పరిసర ప్రాంతాల వారికి ఆహ్లాదం కలిగించేలా సుందరీకరణ పనులు చేపట్టాలన్నారు. చెరువులో నిరంతరం నీరు ఉండేలా ప్రణాళిక సిద్ధం చేయాలని పేర్కొన్నారు. వాకింగ్ ట్రాక్ పునరుద్ధరణ, మిగిలిపోయిన ప్రహరీ నిర్మాణం పూర్తి, చిన్న పిల్లల ఆట సామాగ్రి, జిమ్ పరికరాలు ఏర్పాటు, డెబ్రీస్, ఇతర చెత్త తొలగించాలని, జాతీయ రహదారిపై ఉన్న డ్రెయిన్ శుభ్రం చేయాలని ఆదేశించారు. ఎండాడ లా కాలేజీ సమీపంలోని స్థలంలో జివిఎంసి జోనల్ ఆఫీస్ నిర్మాణానికి అంచనాలు తయారుచేయాలని కోరారు. వైశాఖి స్కై పార్క్ దగ్గర షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. శ్మశానం నిర్మాణానికి త్వరితగతిన టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శాంతిరాజు, కార్పొరేటర్ లొడగల అప్పారావు, కూటమి నాయకులు శాఖరి శ్రీనివాస్, మొల్లి లక్ష్మణరావు, చెట్టిపల్లి సన్యాసిరావు, సారిపల్లి శ్రీనివాస్, బోడపూడి దొరబాబు, మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు దుర్భరం

ప్రజాశక్తి -తగరపువలస : మాదక ద్రవ్యాలు వాడకంతో జీవితాలు దుర్భరంగా మారుతాయని, వాటికి దూరంగా ఉండాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీవాణి విద్యార్థులకు సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నషా ముక్త్ భారత్ అభియాన్ (ఎన్ఎంబిఎ) కార్యక్రమంలో భాగంగా మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలను ఆమె వివరించారు. జాతి నిర్మాణంలో బలమైన శక్తిగా ఉన్న యువత మాదక ద్రవ్యాల బారిన పడితే భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. భారత్‌ను మాదక ద్రవ్య రహిత దేశంగా మార్చేందుకు బాధ్యతతో మెలగాలని యువతను కోరారు. ఈ మేరకు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-యంత్రాంగం

కశింకోట : మండలంలోని కొత్తపల్లి, తేగాడ పంచాయతీ పరిధిలో మండల వ్యవసాయ అధికారి ఎం.స్వప్న ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్త రకం వరి వంగడాలు ఎంటియు 1224, ఆర్‌జిఎల్ 2537, బిపిటి 5204 సబ్సిడీ మీద అందుబాటులో వున్నాయని తెలిపారు. విత్తన శుద్ధి మందు సూడోమోనాస్ 500 గ్రాములు రూ.75 సబ్సిడీ మీద అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ ఎం.లైలాదేవి రైతులు పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని దిబ్బల గొర్లవాని పాలెం, వెన్నెల పాలెం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి ఎం.రమాదేవి ఈ రెండు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. ఖరీఫ్ సీజన్‌కు సాంబ మసూరి 70 క్వింటాళ్లు, ఆర్జీఎల్ 2537 రకం 70 క్వింటాళ్లు, ఆర్ఎన్ఆర్ 15048 రకం 5క్వింటాల్లో, ఎంటియు 1224 రకం ఆరు క్వింటాల్లో, ఎంటియు 1318 రకం రెండు క్వింటాళ్లు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు ఎన్ నారాయణరెడ్డి, ఎమ్ఎన్ మూర్తి, వ్యవసాయ సహాయకులు అనిత, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కె.కోటపాడు : వరి విత్తనాలను వేసుకునేందుకు నారుమళ్లను బాగా కలియ దున్నించాలని మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ తెలిపారు. మండలంలోని గొండుపాలెం గ్రామంలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. విత్తన శుద్ధి నిర్వహించి మొలక శాతాన్ని పరిశీలించాలని సూచించారు. ఆర్జీఎల్, సాంబమసూరి, సోనామసూరి, 1121, 1224 విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి వరహాలుదొర, బి.సుధీర్, రైతులు పాల్గొన్నారు.

నక్కపల్లి : మేలు రకం విత్తనాన్ని ఎంపిక చేసుకోవడం ద్వారా నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చునని బిసిటి, కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్ర ప్రసాద్ అన్నారు. మండలంలోని దేవవరం, చినదొడ్డిగల్లు గ్రామాల్లో వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది నిర్వహించారు. అనంతరం పచ్చి రొట్ట విత్తనాలు చల్లిన పొలాలను రైతులతో కలిసి అధికారులు సందర్శించారు. వ్యవసాయాధికారి ఉమా ప్రసాద్, విస్తరణాధికారి సత్యనారాయణ, రైతు సేవా కేంద్రం సిబ్బంది సురేంద్ర, కృష్ణమోహన్, సన్యాసినాయుడు, రైతులు పాల్గొన్నారు.

చీడికాడ : రైతులందరూ పిఎంబివైఎఫ్ పథకంలో పంటల బీమా చేయించుకుంటే, ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టం జరిగితే పరిహారం పొందవచ్చని మండల వ్యవసాయ అధికారిని కృష్ణవేణి సూచించారు. మండలంలోని మంచాల సిరిజం గ్రామాలలో పొలంబడి పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. వరి విత్తనాలు నాటే సమయంలో సుడోమోనాస్‌తో గాని, బీజామృతంతో గానీ విత్తన శుద్ధి చేసుకుంటే చీడపీడల నుండి పంటలను రక్షించుకోవచ్చన్నారు. గ్రామ సర్పంచులు కన్నూరు చల్లమనాయుడు, కొసిరెడ్డి భాగ్యవతి శ్రీరామ్మూర్తి, మూర్తి వెటర్నరీ అసిస్టెంట్స్ కామేష్ సుధీర్ వర్మ పాల్గొన్నారు

కశింకోట మండలంలో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

గొట్టిపల్లిలో...

ఆనందపురం: ఆనందపురం మండలం గొట్టిపల్లిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యాన మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి కె.అప్పలస్వామి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన గురించి రైతులకు వివరించారు. వరి పంటకు బీమా వర్తించాలంటే ఒక్కో ఎకరానికి రూ.420 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఇప్పటికే పంట రుణాలు తీసుకున్న రైతుల బీమా రుసుమును సంబంధిత బ్యాంకులు రుణాల నుంచి నేరుగా కట్ చేస్తాయని చెప్పారు. రుణాలు లేని రైతులు తమ సమీప రైతు సేవా కేంద్రాల్లో చెల్లించి బీమా పొందవచ్చని తెలిపారు. డిఆర్‌సి వ్యవసాయ అధికారి సురేష్ మాట్లాడుతూ, విత్తనాలను నాటే ముందు శుద్ధి చేయడం చాలా అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సంధ్య రత్నప్రభ, గ్రామ వ్యవసాయ సహాయకులు జి.రాజేశ్వరి, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉక్కునగరంలోని సమస్యలు పరిష్కరించాలి

78వ వార్డు కార్పొరేటర్ గంగారావు

టౌన్‌షిప్ పరిపాలన విభాగం జనరల్ మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న 78వ వార్డు కార్పొరేటర్ గంగారావు

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ టౌన్‌షిప్ పరిపాలన విభాగం జనరల్ మేనేజర్‌కు 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు వినతి పత్రం అందించారు. క్వార్టర్ మధ్య జంగిల్ కటింగ్ లేకపోవడం, కటింగ్ చేసిన వ్యర్థాలు ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో శుభ్రత లేక అనేక సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. దీనివల్ల ట్రాఫిక్ విభాగంలో పనిచేస్తున్న తగరంపూడి శ్రీనివాసరావును ఇంట్లోనే పాము కాటు వేయడంతో ఆయన మృతిచెందినట్లు తెలిపారు. చేతకుండీలు శుభ్రం చేయడం లేదని, వీధి లైట్లు వెలగడం లేదని వివరించారు. వీటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. పార్కుల నిర్వహణ, షాపింగ్ కాంప్లెక్సుల్లో పరిశుభ్రత లోపిస్తోందని, దోమలు, విష కీటకాల నిర్మూలనకు మలేరియా డిపార్ట్‌మెంట్ చేయాల్సిన పనులు నిలిచిపోయాయని తెలిపారు. సివిల్ మెయింటెనెన్స్‌లో భాగంగా పందులు, కుక్కల నియంత్రణకు అవసరమైన యంత్రాంగాన్ని యాజమాన్యం ఏర్పాటు చేయలేదన్నారు. రూ.కోటి వ్యయంతో 56 ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు పనిచేయడం లేదని తెలిపారు. నిర్వహణ సమస్యపై ఎందుకు చర్యలు లేవని ప్రశ్నించారు. మరమ్మతులు, కొత్తవి అమర్చడం కోసం మంజూరు చేసిన నిధులు నిలిచిపోయాయని వివరించారు. సిఆర్‌పిఎఫ్ సిబ్బందిని వెనక్కి పంపడంతో ఆ పనులను టౌన్‌షిప్‌లో ఉన్న హోంగార్డులకు కేటాయించారని, దీంతో టౌన్‌షిప్‌లో హోంగార్డులు తగ్గిపోయి దొంగతనాలను అరికట్టడానికి అవసరమైన గస్తీ కొరవడిందని తెలిపారు. ఈ సమస్యల పరిష్కారానికి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని, టౌన్‌షిప్‌లో ఉన్న ప్రజల ఆరోగ్యానికి, ప్రాణాలకు భద్రత కల్పించాలని కోరారు.

పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ ఆపాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ ఆపాలని పోర్టు యూనియన్ నాయకులు కె.సత్యనారాయణ డిమాండ్ చేశారు. పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ ఆసుపత్రి వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు మంగళవారం నాటికి 267వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏటా రూ.వందల కోట్లు లాభాలు ఆర్జిస్తున్న పోర్టు ఉద్యోగుల ఆరోగ్యాన్ని వ్యాపారం చేయటం సమంజసం కాదన్నారు. ఈ సంవత్సరం సుమారు రూ.824 కోట్లు లాభాలు వచ్చాయని, దానిలో నాలుగో వాటా ఖర్చుపెట్టినా హాస్పిటల్లో ఖాళీగా ఉన్న డాక్టర్లు, సిబ్బందిని నియమించవచ్చని తెలిపారు. పోర్టు యాజమాన్యం వద్ద రిజర్వ్ ఫండ్, వేల ఎకరాల భూమి ఉన్నప్పటికీ ప్రయివేటీకరణకు నిర్ణయం తీసుకోవడం తగదన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెఎస్.కుమార్, గణేష్, శంకర్, బి.జగన్, లక్ష్మణ్, జిసిహెచ్.నాయుడు, రాఘవులు, తదితరులు పాల్గొన్నారు.

వడ్లపూడిలో శ్రీ రథాలమ్మ తల్లి పండగ

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 87వ వార్డు పరిధి వడ్లపూడిలో కణితి గ్రామ దేవత శ్రీ రథాలమ్మ తల్లి పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో గాజువాక మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య పాల్గొని అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో 87వ వార్డు వైసిపి నాయకులు ప్రగడ వేణుబాబు, ఇల్లపు రాము, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, కర్రి నాగేశ్వరావు, గుంట్ల శ్రీను, ప్రగడ రాము, వి.సన్యాసిరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషిచేయాలి

ప్రజాశక్తి -గాజువాక : విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పాటుచేసుకొని, దాన్ని సాధించుకోవడానికి కృషి చేయాలని గాజువాక పోలీస్ స్టేషన్ సిఐ పార్థసారథి తెలిపారు. గాజువాక ఉన్నత పాఠశాలలో చదివి పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులను ప్రాఫిట్ షూ కంపెనీ ఆధ్వర్యాన గాజువాకలోని ఆ కంపెనీ షోరూంలో మంగళవారం సన్మానించారు. పదో తరగతిలో 585 మార్కులు సాధించిన నవ్యశ్రీ, 580 మార్కులు సాధించిన వెన్నెలను సత్కరించి ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా ఎదుగుతుండటం సంతోషకరం అన్నారు. ప్రాఫిట్ షూ యాజమాన్యం సామాజిక బాధ్యతతో విద్యార్థులను ప్రోత్సహించడం మంచి పరిణామం అన్నారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న సామాజిక వేత్త బుద్ధ అప్పలనాయుడు విద్యార్థులకు తన సొంత నగదును ప్రోత్సాహకంగా అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రాఫిట్ షూ గాజువాక షోరూమ్ మేనేజర్ ఎల్లపు రాము, ప్రతినిధులు గుడివాడ శ్రీనివాసరావు, ఎస్‌కె.షఫీ, ఎం.మణిదీప్ పాల్గొన్నారు.

వైసిపి నేతకు చిన్న శ్రీను పరామర్శ

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం సర్పంచ్ తాలాడ పాప భర్త వైసిపి నాయకుడు టి.పద్మనాభస్వామి (పద్దు) రోడ్డు ప్రమాదంలో గాయపడి 15 రోజులుగా ఇంట్లోనే ఉంటున్న విషయం తెలుసుకున్న భీమిలి నియోజకవర్గ వైసిపి ఇన్చార్జి ఎం.చిన్న శ్రీను మంగళవారం పద్మనాభం వెళ్లి పరామర్శించారు. పద్మనాభస్వామి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో ఎంపిపి రాంబాబు, మాజీ ఎంపిటిసి పద్మనాభస్వామి, కృష్ణాపురం నాయకులు గాడు అప్పలరాజు, మాజీ సర్పంచ్ నారాయణరావు తదితరులు ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

ప్రజాశక్తి -ములగాడ : వైసిపి బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, పార్టీ పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ పిలుపునిచ్చారు. వైసిపి నాయకులు పిలక రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యాన మంగళవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మళ్ల విజయప్రసాద్ హాజరై మాట్లాడుతూ, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి తప్పనిసరిగా గుర్తింపు ఉంటుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నేటికీ నెరవేర్చలేని కూటమి ప్రభుత్వానికి రానున్న కాలంలో బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పీల అనంతకుమార్, బోగవిల్లి నాగభూషణం, జివిఎస్ఎస్.రాజు, పిల్ల కన్నబాబు, కొల్లి నూకరెడ్డి, ఎన్‌వి.రమణ, బోస, అప్పల రెడ్డి, వటి నూకరాజు, మంగ, చొక్కా వరలక్ష్మి, బోస వెంకటలక్ష్మి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మళ్ల విజయప్రసాద్

కిమ్స్ ఐకాన్‌లో అరుదైన శస్త్ర చికిత్స

కొలుకున్న రోగితో వైద్యులు

ప్రజాశక్తి -గాజువాక : పుట్టుకతోనే వెన్నెముకలో లోపం కారణంగా మూత్రం లీక్ అవుతూ, కిడ్నీలు పాడైపోయిన ఒక యువకునికి విశాఖపట్నంలోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి వైద్యులు అసాధారణ శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. దీంతో అతడు సాధారణ జీవనం గడపడంతో పాటు కిడ్నీలు కూడా ఇప్పుడు సురక్షితంగా ఉన్నాయని కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ కుచ్చర్లపాటి అభిరామ్ తెలిపారు. డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న 18 ఏళ్ల యువకునికి పుట్టుకతోనే వెన్నెముకలో సమస్య ఉందని తెలిపారు. దాన్ని వైద్య పరిభాషలో స్పైనల్ మైలోమెనింగోసీల్ అంటారని, దీనివల్ల నరాలు దెబ్బతిని, అతడి మూత్రకోశం సరిగా పనిచేయదని వివరించారు. మూత్రకోశం బాగా కుచించుకుపోవడంతో తనంతట తానుగా మూత్రవిసర్జన చేయలేకపోతున్నాడని పేర్కొన్నారు అప్పుడప్పుడు మూత్రం లీకవుతూ కిడ్నీలు కూడా దెబ్బతిన్నాయని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించడానికి రెండు దశల్లో సంక్లిష్టమైన పునర్నిర్మాణ శస్త్రచికిత్స చేయాలని యూరాలజీ బృందం డాక్టర్ పి.మురళీకృష్ణ, డాక్టర్ కె.అభిరామ్, డాక్టర్ కె.సందీప్‌రెడ్డి నిర్ణయించినట్లు వివరించారు. అందులో ముందుగా బ్లాడర్ ఎన్‌లార్జ్‌మెంట్ చేపట్టామని, ఇందుకోసం పేగుల్లో కొంత భాగాన్ని తీసుకుని, బ్లాడర్‌ను విస్తరించడంతో అంతర్గతంగా ఒత్తిడి తగ్గిందని తెలిపారు. తర్వాత రోగి అపెండిక్స్ తీసుకుని, దాని ద్వారా మూత్రకోశం నుంచి బొడ్డు వరకు ఒక సన్నటి కాలువలా ఏర్పాటుచేశామని పేర్కొన్నారు. దీన్ని మిట్రోఫానాఫ్ ప్రొసీజర్ అంటారని, ఈ కాలువ ద్వారా ఒక సన్నటి క్యాథెటర్ ట్యూబు సాయంతో మూత్రవిసర్జన చేయగలుగుతున్నాడని వివరించారు. దీంతో అతడికి మూత్రం లీకేజి ఆగిపోయి, కిడ్నీ పనితీరు కూడా మెరుగుపడిందని తెలిపారు. ఈ ట్యూబు సాయంతో అతడు ఇప్పుడు రోజుకు మూడుసార్లు సులభంగా మూత్రవిసర్జన చేయగలుగుతున్నాడని, అది కూడా పూర్తి నియంత్రణతో చేయడం వల్ల అతడికి ఉన్న సామాజిక సమస్య కూడా తొలగిపోయిందని పేర్కొన్నారు. ఇది చాలా సవాలుతో కూడుకున్న శస్త్రచికిత్స అని, కిడ్నీలను కాపాడాలంటే ఇది ఒక్కటే పరిష్కారమార్గం అని చెప్పారు. ఈ శస్త్రచికిత్స తర్వాత అతడు పూర్తిగా కోలుకున్నాడని, కిడ్నీల పనితీరు కూడా సాధారణ స్థాయికి చేరిందని వివరించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ అర్బన్ పరిధి మద్దిపాలెం సెక్టార్‌లోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం మహిళ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ కెవి.రామలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. జివిఎంసి 51వ వార్డు పరిధి గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రం పని తీరుపై చిన్నారుల తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో పలు రికార్డులను పరిశీలించారు. కేంద్రంలో చిన్నారులను శత శాతం పెంచాలని అంగన్‌వాడీ కార్యకర్తకు సూచించారు. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయిలెట్స్ లేకపోవడాన్ని గుర్తించి ఏర్పాటుకు చర్యలు చేపడతామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ మద్దిపాలెం సెక్టార్ సూపర్‌వైజర్ జెటిఎన్.జ్యోతి, పోషణ్ అభియాన్ జిల్లా కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కమిషనర్‌ను కలిసిన బెహరా

ప్రజాశక్తి -గోపాలపట్నం : గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కేతన్ గార్గ్‌ను జనసేన నాయకులు బెహరా భాస్కర రావు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో గునిశెట్టి శ్రీనివాసరావు, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్సు షెల్టర్ ఏర్పాటుచేయాలి

ప్రజాశక్తి -తగరపువలస : ప్రయాణికుల సౌకర్యార్థం స్థానిక జంక్షన్‌లో బస్సు షెల్టర్ ఏర్పాటుచేయాలని సిపిఐ భీమిలి ఏరియా సమితి కార్యదర్శి కానూరు రాంబాబు ఆర్‌టిసి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం పార్టీ ఏరియా సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బస్సు షెల్టర్ లేక పోవడంతో ప్రయాణికులు ఎండ, వానల్లో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆర్‌టిసి డ్రైవర్లు, కండక్టర్లకు, ప్రయాణికులకు మరుగుదొడ్ల సదుపాయం కల్పించాలని కోరారు. తగరపువలస జంక్షన్ మీదుగా ఆర్‌టిసి ఎక్స్‌ప్రెస్ బస్సులను మళ్లించాలని కోరారు. రైతు బజారులో పూర్తి స్థాయిలో కూరగాయలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ శాఖ అధికారులను కోరారు. రెండు పూటలా కూరగాయలు అమ్మకాలు కొనసాగించేలా పని వేళల్లో స్వల్ప మార్పులు చేయాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ ఏరియా సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు, పార్టీ నాయకులు ఆదినారాయణ, వీర్రాజు, సన్ని బాబు, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన

శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి -గోపాలపట్నం : హెచ్ సి వెంకట్రావు గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలికల జూనియర్ కాలేజీల్లో శక్తియాప్‌పై విద్యార్థులకు హెడ్ కానిస్టేబుల్ వెంకటరావు అవగాహన కల్పించారు. పోక్సోచట్టం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి విషయాలను వివరించారు. పిల్లలు బయట ఎలా ప్రవర్తించాలి, అపరిచితుల పట్ల ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచించారు. పిల్లల భద్రతపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరింత శ్రద్ధ వహించాలన్నారు. పిల్లలకు మంచి ఏదో.. చెడు ఏదో తల్లిదండ్రులు వివరించాలని చెప్పారు. ఏ టచ్ ఎలాంటిదో.. ఎవరిని దగ్గరగా రానివ్వకూడదో.. ఎవరూ ఎక్కడ తాకకూడదో చెప్పడానికి సంకోచిస్తున్నారని, ఈ ధోరణిని వీడి, పిల్లలకు ఏది మంచో, ఏది చెడో వివరించాలని కోరారు. అత్యవసర సమయాల్లో మహిళలు శక్తి యాప్ వినియోగించుకోవాలని, మహిళల భద్రత కోసమే ఈ యాప్ ప్రత్యేకంగా రూపొందించబడిందని తెలిపారు. ప్రతి మహిళా శక్తి యాప్‌ను ఫోన్లో డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఈ యాప్ ఇన్‌స్టాల్ చేసుకున్న వారి ఫోను కంట్రోల్ రూమ్‌కు కనెక్ట్ అవుతుందని తెలిపారు. ప్రమాదంలో కానీ, అత్యవసర సమయాల్లో ఫోనును 5 సార్లు షేక్ చేస్తే ప్రమాదంలో ఉన్నట్లు కంట్రోల్ రూమ్‌కు అలర్ట్ వస్తుందన్నారు. దీంతో దగ్గర్లోని పోలీసులు 5 నిమిషాల్లో బాధిత మహిళ వద్దకు వచ్చి సహాయం చేస్తారని వెల్లడించారు. వీటితోపాటు సైబర్ నేరాలు, డ్రగ్స్ వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో అందుబాటులో ఉండే టోల్ ఫ్రీ నంబర్లను వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు జగన్నాథం, ప్రసాద్, లీలా, పార్వతీదేవి తదితరులు పాల్గొన్నారు.

5వ వార్డు సమస్యలపై వినతి

ప్రజాశక్తి-కొమ్మాది : జివిఎంసి 5వ వార్డులో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ మేయర్ పీలా శ్రీనివాసరావుకు, నూతన కమిషనర్ కేతన్ గార్గ్‌కు వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత మంగళవారం వినతి పత్రాలు అందజేశారు. రాజీవ్ గృహకల్ప, జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీల్లో యుజిడి సమస్యకు సత్వర శాశ్వత పరిష్కారం చూపాలని, బొట్లవానిపాలెం, నగరంపాలెం చెరువులను ఆధునీకరించాలని, శివశక్తినగర్ నుంచి మారికవలస 100 అడుగుల రోడ్డును కలుపుతూ బిటి రోడ్డు వేయాలని, వార్డులోని పార్కులు ఆక్రమణకు గురికాకుండా, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని, కొండవాలు ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు, మెట్ల మార్గాలు నిర్మించాలని, మారికవలస నుండి ఓజోన్ వ్యాలీ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిలో కల్వర్టు నిర్మించాలని కోరారు.

ఎస్ఇజెడ్ పరిశ్రమలకు సమ్మె నోటీసులు

కంపెనీ ప్రతినిధికి సమ్మె నోటీసు ఇస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

దేశవ్యాప్తంగా జులై 9న తలపెట్టిన కార్మిక సమ్మెకు సంబంధించి ఎస్ఈజెడ్‌లోని పలు పరిశ్రమల ప్రతినిధులను సిఐటియు నాయకులు మంగళవారం కలిసి సమ్మె నోటీసులు అందజేశారు. ఎస్ఇజెడ్‌లోని అధిస్థాన్, పిల్ కింగ్ టన్, విన్ విన్, బయో డీజిల్, మైతాన్, టఫ్, ఆర్‌సిఎల్ తదితర పరిశ్రమల ప్రతినిధులను సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుల ఆర్.రాము, మండల కన్వీనర్ కె.సోమునాయుడు కలిశారు. కార్మికుల తలపెట్టిన సమ్మెకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా రాము, సోమునాయుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని, కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు, కార్పొరేట్లకు అనుకూలంగా పనిచేస్తున్నాయని విమర్శించారు. బ్రిటిష్ కాలం నాటి నుండి కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నేటి ప్రభుత్వాలు తుంగలో తొక్కుతున్నాయని విమర్శించారు. కార్మికుల ప్రయోజనాల కంటే కార్పొరేట్ సంస్థల వైపే ప్రభుత్వాలు మొగ్గు చూపుతున్నాయని విమర్శించారు. 44 కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం గత 11 సంవత్సరాలు కాలంలో కాలరాశారన్నారు. నేడు ఎనిమిది గంటల పని విధానాన్ని 10 నుండి 12 గంటల వరకు చేస్తున్నారని, కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో అన్ని పరిశ్రమల కార్మికులు స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్.సత్తిబాబు సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట : వచ్చేనెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు ఈరెల్లి చిరంజీవి పిలుపునిచ్చారు. మంగళవారం రోలుగుంటలో ఆశ వర్కర్లతో సమావేశంలో సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ పరిశ్రమలు ప్రైవేట్ పరం చేయకూడదని, ఎరుగుతున్న నిత్యవసరం ధరలు, డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్‌తో దేశవ్యాప్తంగా సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆశ యూనియన్ నాయకులు ఇంద్ర మణి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు, ఆశా నేతలు

26 నుండి 30 వరకు రేషన్ డోర్ డెలివరీ

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : నెల 26 నుండి 30 తేదీ వరకు వృద్ధులకు, వికలాంగులకు రేషన్ డోర్ డెలివరీ చేస్తామని తహసిల్దార్ ఎం.లక్ష్మి మంగళవారం తెలిపారు. ఈ మేరకు రేషన్ డీలర్లు అందరికీ ఆదేశాలు ఇచ్చినట్టు చెప్పారు. ఇప్పటికే రేషన్ సరుకులు సంబంధిత డిపోలకు చేరాయని, ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరిస్తే డీలర్లుపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వృద్ధులు, వికలాంగులు రేషన్ సరుకుల కోసం డిపోల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

పోలవరం నిర్వాసితుల పునరావాస సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల అపరిష్కృత పునరావాస సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం డీఆర్వో సత్యనారాయణరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్‌రావు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా లక్షలాదిమంది గిరిజన, గిరిజనేతర ప్రజలు నిర్వాసితులయ్యారని, దశాబ్ద కాలంగా ప్రాజెక్టు నిర్మాణం కొనసాగుతూ ఉన్నా నిర్వాసితుల సమస్యలు మాత్రం పరిష్కారం కావట్లేదని వాపోయారు. ప్రభుత్వాలన్నీ ప్రాజెక్టు నిర్మాణం చుట్టూనే దృష్టి పెడుతున్నాయి తప్ప, నిర్వాసితుల సమస్యలను పట్టించుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గొర్లి రాజు, అయితిరెడ్డి అప్పలనాయుడు, లగిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటి ఫలితాల్లో సత్తా

భీమిలి మండలం విద్యార్థులు

ప్రజాశక్తి-యంత్రాంగం

తగరపువలస : ట్రిపుల్ ఐటి ఫలితాల్లో చిట్టివలస జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. తొలి విడత ఫలితాల్లో జీరు వెంకటకీర్తన్ నూజివీడు, సరగడ జగదీష్, చెల్లూరి వినయ్, కందివలస రఘు వర్మ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటిలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు డి.ఆదినారాయణ తెలిపారు. చిట్టివలస జెడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థినులు మదాబత్తుల వర్షిణి, బి.వలీవా, సిహెచ్ లాస్య శ్రీకాకుళం ట్రిపుల్ ఐటికి ఎంపికయ్యారని హెచ్ఎం శివజ్యోతి తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు అభినందించారు.

జివిఎంసి మూడో వార్డు పరిధిలోని కెజిబివి విద్యార్థిని కొక్కిరి మేఘన శ్రీకాకుళం ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ గంగా కుమారి తెలిపారు.

ఆనందపురం మండల విద్యార్థులు

ఆనందపురం : ఆనందపురం మండలం లోడగలవానిపాలెం గ్రామంలోని కెజిబివి విద్యార్థులు ఎస్.ఢిల్లీశ్వరి, జి.వర్ధిని శ్రీకాకుళం ట్రిపుల్ ఐటిలో సీట్లు సాధించారని పాఠశాల ప్రిన్సిపల్ ఎస్.సత్యలావణ్య తెలిపారు. విద్యార్థినులను డిఇఒ ప్రేమ్‌కుమార్, ఏపీ సమగ్ర శిక్ష అధికారి చంద్రశేఖర్, జిసిడిఒ శ్రీదేవి, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ శివాజీ, వైస్ చైర్మన్ మంగ తదితరులు అభినందించారు.

చీడికాడ : మండలంలోని మంచాల గ్రామంలోని ఎపి మోడల్ స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ఐటికి ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపల్ సిహెచ్ వెంకటలక్ష్మి తెలిపారు ఆదర్శపాఠశాలకు చెందిన డి సుధీర్, ఎస్ యశస్విని ట్రిపుల్ ఐటికి ప్రవేశార్హత సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఎపి మోడల్‌స్కూల్‌లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు అధ్యాపకులతో సమన్వయం చేసుకుని ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తూ మంచి ఫలితాలను సాధిస్తున్నామని ప్రిన్సిపల్ వెంకటలక్ష్మి తెలిపారు.

రావికమతం: ట్రిపుల్ ఐటిలో ప్రవేశానికి మరుపాక ఆదర్శ పాఠశాలకు చెందిన ఇరువురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కె.సత్య సునీల్ తెలిపారు. 10వ తరగతి పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన తట్టబంద గ్రామానికి చెందిన ఎస్. ధనలక్ష్మి, రాయవరం గ్రామానికి చెందిన సేనాపతి తనూజ ఇద్దరూ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటికి ప్రవేశార్హత సాధించారన్నారు. దీనిపై ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కాశెట్టి రాజు, పాఠశాల సిబ్బంది,విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

రావికమతం మండల విద్యార్థులు

మాడుగుల : మాడుగుల గ్రామానికి చెందిన గైరిపట్టపు రమణ, భవాని దంపతులు కుమార్తె సిరివర్షిణికి ట్రిపుల్ ఐటీలో సీటు లభించింది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటూ వీనస్ కోచింగ్ ఇనిస్టిట్యూట్లో శిక్షణ తీసుకున్న వర్షిణికి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటిలో సీటు లభించిందని వీనస్ ఇనిస్టిట్యూట్ కరెస్పాండెంట్ తాళ్ళపురెడ్డి నాగచంద్ర తెలిపారు. సిరివర్షిణికి తల్లి భవానీ, తండ్రి వెంకటరమణ, అన్నయ్య హర్షవర్ధన్ స్వీట్ తినిపించి ఆనందం వ్యక్తం చేశారు. స్కూల్ హెడ్ మాస్టర్ ముత్యాలనాయుడుకు, ఉపాధ్యాయులకు, వీనస్ కరెస్పాండెంట్ తాళ్ళపురెడ్డి నాగచంద్రకు విద్యార్థిని తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

చీడికాడ మండల విద్యార్థులు, మాడుగుల మండల విద్యార్థి

బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండలం నుండి పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 8 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు మండల విద్యాశాఖ అధికారి-2 బుద్ధ కాశీ విశ్వేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీతయ్యపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కె.శ్రీలక్ష్మి, జి.విజయజ్యోతి, కె.ధన్యశ్రీ, జె.ప్రవీణ్, రాజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన మరిస రామ్‌చరణ్, కర్రి భవ్యశ్రీ, విజయరామరాజు పేట ఉన్నత పాఠశాలకు చెందిన కాండ్రేగుల శంకర్, వడ్డాది ఉన్నత పాఠశాలకు చెందిన సింగిడి సాయి కుసుమ ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు ఆయన వెల్లడించారు.

బుచ్చయ్యపేట మండల విద్యార్థులు

వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

బదిలీ ఉపాధ్యాయుల జీతాల సమస్యలను పరిష్కరించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-అనకాపల్లి : బదిలీ అయిన ఉపాధ్యాయుల జీతాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా నాయకులు మంగళవారం జిల్లా ఖజానా అధికారి విఎల్ సుభాషినిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ మాట్లాడుతూ బదిలీలు, ప్రమోషన్లు పొందిన ఉపాధ్యాయులు తాము జాయిన్ అయిన కొత్త పాఠశాలలలో జీతాలు పొందడానికి, పాత ప్లేస్‌లోని కాలానికి నాన్ డ్రాయల్ తీసుకుని, కొత్త ప్లేస్‌లోనే జీతం బిల్లులు తయారు చేసుకొనేందుకు జిల్లాలోని ఎస్‌టిఓలకు తగిన సూచనలు చేయాలని కోరారు. డిఇఓ, సిఎస్ఈ వారు శాంక్షన్ చేసిన క్యాడర్ స్ట్రెంత్ వివరాలను జిల్లాలోని సదరు ఎస్‌టిఓలకు సర్క్యులేట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏపీ ఫైనాన్షియల్ కోడ్‌ను అనుసరించి హెచ్ఆర్ఏ మార్పు జరిగిన ఉపాధ్యాయులు, సదరు కాలానికి హెచ్ఆర్ఏ బిల్లులను వేర్వేరుగా చేసి, కొత్త ప్లేస్‌లోనే జీతం తీసుకునే సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. దీనికి ఖజానా అధికారి స్పందిస్తూ సదరు విషయాలను ఉన్నతాధికారులకు నివేదించి, తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సిహెచ్‌సి సూపరింటెండెంట్‌గా డాక్టర్ దినేష్‌కుమార్

దినేష్‌కుమార్‌ను అభినందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-చోడవరం రూరల్ : చోడవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సిహెచ్‌సి) మెడికల్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ సిహెచ్.దినేష్ కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ దినేష్‌కుమార్ కొంతకాలం నుంచి ఇదే ఆసుపత్రిలో జనరల్ ఫిజీషియన్‌గా పని చేస్తున్నారు. ఇక్కడ సూపరింటెండెంట్‌గా పని చేసిన డాక్టర్ ఎల్.వినయ్ కుమార్ తుని ఏరియా ఆసుపత్రికి బదిలీపై వెళ్లారు. అలాగే కొన్ని నెలలుగా ఖాళీగా ఉన్న గైనకాలజిస్ట్‌ను భర్తీ చేశారు. గైనకాలజిస్టుగా డాక్టర్ విష్ణు ప్రియను నియమించారు. ఈమె అనకాపల్లి జిల్లా ఆసుపత్రి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ హాస్పిటల్‌కు వచ్చే వ్యాధిగ్రస్తుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారికి ఎల్లవేళలా వైద్య సేవల అందిస్తామని తెలిపారు.

ట్రిపుల్ ఐటికి ఎంపికైన విద్యార్థులకు సత్కారం

ప్రజాశక్తి-మునగపాక : పదవ తరగతి పరీక్షలలో ప్రతిభ కనబరిచి, ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను మంగళవారం పాఠశాల ఆవరణలో ఘనంగా సత్కరించారు. గ్రామానికి చెందిన ఆడారి లక్ష్మి గణేష్, మౌనిక అన్నపూర్ణ, పెంటకోట సుమశ్రీ, టెక్కలి భాగ్యశ్రీలతో పాటు ఒంపోలు గ్రామానికి చెందిన బుదిరెడ్డి రేణుక, గనిరెడ్డి సౌజన్యాలను గ్రామ పెద్దలు శాలువలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ ఆడారి సూర్యచంద్ర రామారావు, సర్పంచ్ దిమ్మల అప్పారావు, జడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయి కృష్ణ, వైసిపి మండల అధ్యక్షులు ఆడారి గణపతి అచ్చం నాయుడు, జనసేన మండల అధ్యక్షులు టెక్కలి పరశురాం, గ్రామీణ యువజన మందిరం అధ్యక్షులు ఆడారి శ్రీకాంత్, దాడి ముసలి నాయుడు, పెంటకోట శ్రీరామ్మూర్తి, హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటికి ఎంపికైన విద్యార్థులను సత్కరిస్తున్న దృశ్యం

కుళాయిల కోసం వేస్తున్న పైపులైన్లను పరిశీలిస్తున్న సర్పంచ్

ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి- అనకాపల్లి : పంచాయతీలో ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే పంచాయితీ లక్ష్యమని మండలంలోని తుమ్మపాల సర్పంచు తట్టా పెంటయ్య నాయుడు అన్నారు. తుమ్మపాల కొత్తపేట వీధిలో గతంలో సిసి కాలువ నిర్మాణం వేయడం వలన ఇంటింటి కుళాయి పనులు ఆగాయని, ఇప్పుడు తిరిగి పనులు ప్రారంభించామని చెప్పారు. ఈ మేరకు మంగళవారం కుళాయిల నిర్మాణ పనులను పరిశీలించారు. పోలమాంబ ఆలయ ప్రాంతంలో ఆయన పర్యటించి అక్కడ ఉన్న డ్రైనేజ్ సమస్యలను, ఎలక్ట్రికల్ సమస్యలను, ఇంటింటి కొళాయిల సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. జేజేయం కోసం ప్రతిపాదనలు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, డిఈ ద్వారా ఎస్ఈకి పంపడం జరిగిందని, ఆర్డర్స్ వచ్చిన వెంటనే ఇంటింటి కొలాయి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు రాజేశ్వరి, తర్రా సత్యారావు, ఆడారి ప్రసాద్, కె.బాబూరావు, మత్తుర్తి మహేష్ పాల్గొన్నారు.

నూకాంబికను దర్శించుకున్న రవీంద్రనాథ్

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎపి క్రీడా ప్రాధికారిక సంస్థ సభ్యులుగా నియమించబడిన పేరం రవీంద్రనాథ్ దంపతులు మంగళవారం శ్రీనూకాంబిక అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం అమ్మవారి ప్రసాదం దేవస్థానం కమిటీ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27న విజయవాడలో తమ కమిటీ ప్రమాణ స్వీకారం చేస్తుందని తెలిపారు. అనంతరం రాష్ట్రంలో క్రీడలు, క్రీడాకారుల, క్రీడా మైదానాల అభివృద్ధికి కషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, రిటైర్డ్ జీవీఎంసీ క్రీడా సహాయ సంచాలకులు కేఎన్‌వి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా జన్ జాతీయ గౌరవ్ వర్ష్

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని చింతలపూడి పంచాయతీ శివారు సమ్మెద గ్రామంలో మంగళవారం జన్ జాతీయ గౌరవ్ వర్ష్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ దొమ్మంగి బోడమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా గిరిజనుల త్యాగాలను, సాంస్కృతిక వారసత్వాన్ని దేశ ప్రజలకు పరిచయం చేయడం జరుగుతోందని తెలిపారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో గిరిజనుల పాత్రను గుర్తు చేస్తూ, వారికి గౌరవం కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. జనమన్ ద్వారా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. సర్పంచ్ దొమ్మంగి బోడమ్మ మాట్లాడుతూ గ్రామం అభివృద్ధికి గ్రామస్తుల భాగస్వామ్యం కీలకమని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు, యువత, మహిళలు పాల్గొన్నారు.

తాతయ్యబాబును కలిసిన ప్రిన్సిపల్

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : వడ్డాది ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన జి.చిన్నారావు మంగళవారం రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువతో సత్కరించి అభినందించారు. నర్సీపట్నం ప్రభుత్వ కాలేజీలో ఇంగ్లీష్ లెక్చరర్‌గా పనిచేసిన చిన్నారావు ఉద్యోగోన్నతిపై వడ్డాది విచ్చేశారు. ఈ నేపథ్యంలో ప్రిన్సిపాల్ గ్రామంలోని పెద్దలతో భేటీ అయ్యారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి కళాశాలకు పూర్వ వైభవం తీసుకురావాలని తాతయ్య బాబు సూచించారు.

నేడు టిడిపి నియోజకవర్గ స్థాయి సమావేశం

ప్రజాశక్తి-సబ్బవరం : టిడిపి పెందుర్తి నియోజకవర్గస్థాయి సమావేశం ఈనెల 25న బుధవారం ఉదయం 10 గంటలకు నియోజకవర్గం ఇన్‌ఛార్జి గండి బాబ్జి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు సబ్బవరం మండల టీడీపీ అధ్యక్షులు గండి ముత్యాలనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి పెందుర్తి నియోజకవర్గం సంస్థాగత ఎన్నికల పరిశీలకులు కోరాడ రాజబాబు ముఖ్యఅతిథిగా విచ్చేస్తున్నారని పేర్కొన్నారు. మండలంలోని పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి

ప్రజాశక్తి-పరవాడ : జెఎన్ ఫార్మాసిటీలోని వ్యర్థ జలాలను సిఈటిపి నుండి ప్రహరీ గోడను ఆనుకొని బయట చెరువులు, కాలువల్లోకి నిబంధనలు ఉల్లంఘించి విడుదల చేస్తున్న రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన రాంకీ విడుదల చేస్తున్న వ్యర్థ రసాయనికి వ్యర్థ జలాలను పరిశీలించారు. అనంతరం గనిశెట్టి మీడియాతో మాట్లాడుతూ వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా బయటికి వదిలేయడంతో పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వర్షాలు వచ్చిన ప్రతిసారీ వ్యర్థ రసాయనికి జలాలను బయటకు విడిచిపెడుతున్నారని పేర్కొన్నారు. అయినా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఈ వ్యర్థ జలాలు మొల్లోడు గెడ్డలోకి చేరి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని, స్థానికులు రైతులు ఈ ప్రాంతంలో జీవించలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మొల్లోడు గెడ్డలో గతంలో పిసిబి అధికారులు తీసిన వ్యర్థ జలాల నమూనాలలో సిటిఓ అండ్ హెచ్‌డబ్ల్యూఏ నిబంధనలు పాటించలేదని నిర్ధారించారని గనిశెట్టి గుర్తు చేశారు. రాంకీ యాజమాన్యం విడిచి పెడుతున్న వ్యర్థ రసాయనికి జలాలపై నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటే సరిపోదని, యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు చెప్పారు. వెంటనే వ్యర్థ జలాలను మోటారుల ద్వారా సిఈటిపి లోకి తోడించాలని, లేకుంటే ప్రజలతో కలిసి ఆందోళన చేపడతామని గనిశెట్టి హెచ్చరించారు.

వ్యర్థ రసాయన జలాలను పరిశీలిస్తున్న గనిశెట్టి

అల్లిగెడ్డ ఆక్రమణలపై గ్రామస్తుల ఆగ్రహం

- అక్రమంగా నిర్మించిన రహదారి తొలగింపు
- పూర్తిగా తొలగించాలని టెక్కలి పాలెం రైతుల డిమాండ్

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని ఆరిపాక- టెక్కలిపాలెం ఇరు గ్రామాల సరిహద్దులో ఉన్న అలిగెడ్డ (ఫీడర్ ఛానల్)ను ఆక్రమించడంపై టెక్కలిపాలెం గ్రామ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అల్లిగెడ్డలో ఆక్రమణ చేసి గొట్టాలు వేసి అక్రమంగా నిర్మించిన రహదారిని మంగళవారం తొలగించారు. దీనికి సంబంధించి గ్రామస్తులు తెలిపిన వివరాలు ప్రకారం... అల్లిగెడ్డ మండలంలోని బంగారమ్మపాలెం, ఆరిపాక మీదుగా ప్రవహించి టెక్కలి పాలెం గ్రామంలోని పారమ్మ చెరువు, కోనేరు, ముసిడి బంద, గవరవాని చెరువు, జమ్మునుపాత్రుని చెరువు, రాజు చెరువులకు సాగునీటిని అందిస్తుంది. ఈ అల్లిగెడ్డ ఆరిపాక సర్వే నంబర్ 5లో ఎకరా 6 సెంట్లు, సర్వే నెంబరు 8లో ఎకరా నాలుగు సెంట్లు, సర్వే నంబర్ 14లో రెండు ఎకరాల 50 సెంట్లు వెరసి 4 ఎకరాల 60సెంట్లు ఉంది. దీని వెడల్పు 54 అడుగులు మేర ఉందని గ్రామ రెవిన్యూ అధికారి, సర్వేయర్ తెలిపారు. టెక్కలిపాలెం చెరువులకు నీరు ప్రవాహం ఈ గెడ్డ ద్వారానే వస్తుంది. ఈ గెడ్డ నాయనమ్మ పాలెం, ఆదిరెడ్డిపాలెం మీదుగా చిన్నయ్యపాలెం బొర్రమ్మ గెడ్డలో కలుస్తుంది. అయితే ఈ అల్లి గెడ్డ (ఫీడర్ ఛానల్)ను కొంతమంది ఆక్రమించి ప్రైవేట్ లే అవుట్‌కు రహదారి అక్రమంగా నిర్మించారు. అల్లిగెడ్డ ఆక్రమణల వలన తమ గ్రామాల్లోని సాగునీటి చెరువులకు నీటి ప్రవాహం తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే రెవిన్యూ అధికారులు, ఇరిగేషన్ అధికారులు ఈ ఆక్రమణలపై చర్యలు తీసుకొని అల్లిగెడ్డ సరిహద్దులు గుర్తించి ఆక్రమణలు తొలగించాలని రైతులు కోరుతున్నారు.

ఈ గెడ్డలో వేసిన గొట్టాలను ఆరిపాక వీఆర్వో బి.అప్పలరాజు తమ సిబ్బందితో కలిసి మంగళవారం తొలగించారు. దీనిపై ఉన్నతధికారులకు నివేదిక పంపించి అల్లిగెడ్డ అక్రమణలను తొలగిస్తామని అయన స్పష్టం చేశారు. దీనితో రైతుల ఆగ్రహం చల్లారింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొంప సత్యవమ్మ నాయనప్ప, పైల వెంకటరమణ, పంచాడ శ్రీనివాసరావు, దొగ్గ చిన్నయ్య, బర్ల శ్రీనివాసరావు, యడ్ల బంగారయ్య, దొగ్గ కృష్ణ, పంచాడ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గెడ్డ కప్పేసి వేసిన రోడ్డును తొలగిస్తున్న దృశ్యం

తల్లికి వందనం వర్తింపజేయాలని వినతి

వినతిపత్రం ఇస్తున్న సిఐటియు, అంగన్వాడీ నేతలు

ప్రజాశక్తి-రాంబిల్లి : చిరు ఉద్యోగులకు, స్కీమ్ వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని మండల తహసీల్దారు, ఎంపిడిఒకు సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి దేవుడు నాయుడు మాట్లాడుతూ ఎంతమంది పిల్లలుంటే, అంతమందికి తల్లికి వందనం పథకం అమలు చేస్తామనిగత ఎన్నికలు సందర్భంగా చెప్పిన కూటమి నేతలు ఇప్పుడు కొంతమందికే ఇస్తుండడంతో ఎంతోమంది తల్లులు ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగంలో అనేక సేవలు అందిస్తున్న పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన అంగన్వాడీ వర్కర్ల పిల్లలకు తల్లికి వందనం సంపూర్ణంగా అందించాలని, కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని పూర్తిస్థాయిలో అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు చోడిపల్లి గంగరాజు, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రేడ్-2 జెఎల్‌ఎంల బదిలీలు నిలుపుదలపై హర్షం

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ శాఖ పరిధిలో సచివాలయం ద్వారా పనిచేస్తున్న గ్రేడ్-2 జూనియర్ లైన్‌మెన్‌ల బదిలీలు నిలుపుదల చేయడంపై యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ మంగళవారం హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వేపాడ సత్యనారాయణ, రీజనల్ అధ్యక్షులు ప్రేమ చంద్రశేఖర్, చందర్రావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకర్రావు మంగళవారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. సచివాలయం గ్రేడ్-2 జేఎల్‌ఎంలను విద్యుత్ శాఖలో విలీనం చేయాలని, ప్రమోషన్ ఇచ్చిన తర్వాతే విద్యుత్ శాఖ పరిధిలో బదిలీలు నిర్వహించాలని అన్ని విద్యుత్ శాఖ కార్యాలయాల్లోనూ, జిల్లా ప్రజా ఫిర్యాదుల వేదికలో తమ యూనియన్ వినతి పత్రాలు ఇవ్వడంతో ఈపీడీసీఎల్ సిఎండి బదిలీ నిలుపుదల చేస్తూ ప్రకటించినట్లు యూనియన్ నాయకులు పేర్కొన్నారు. తక్షణమే ప్రమోషన్ ఇవ్వాలని, గ్రేడ్ 2 నుండి గ్రేడు 1 ప్రమోషన్ ఇవ్వాలని, స్థానిక నివాసంతో నిమిత్తం లేకుండా బదిలీలు చేయాలని కోరారు.

జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు సంస్కృతి విద్యార్థులు

ప్రజాశక్తి-పరవాడ : సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థులు హెచ్.కుమార్, కె.తనీష్‌సాయి, ఎమ్.లక్ష్యలు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం హపూర్ జిల్లా ఘరముఖ్తేశ్వర్‌లో ఈ నెల 27 నుండి జులై 1 వరకు జరుగు 33వ జూనియర్ నేషనల్ బేస్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్. సీతాలక్ష్మి తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు, కోచ్ రాజేష్‌కు స్కూల్ సీఈఓ కె. నిశాంత్ అభినందనలు తెలిపారు.

సహ న్యాయ సమన్వయ సంఘం ఉపాధ్యక్షునిగా జెట్టి

ప్రజాశక్తి-సబ్బవరం : సమాచార హక్కు చట్టం న్యాయ సమన్వయ సంఘం అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షుడుగా మండలంలోని వంగలి గ్రామానికి చెందిన జెట్టి హేమంత్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం అనకాపల్లిలో జరిగిన ఒక కార్యక్రమంలో న్యాయ సమన్వయ సంఘం జిల్లా ప్రతినిధులు ప్రకటించారని జెట్టి హేమంత్ కుమార్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ఆవిర్భావం నుంచి పార్టీలో ఉంటూ విద్యార్థి సోషల్ మీడియాలలో పని చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం జనసేనలో చేరి క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. సమాచారం హక్కు చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తూ, దాని అమలు కోసం అధికారులపై ఒత్తిడి తీసుకువస్తానని తెలిపారు. హేమంత్ కుమార్ నియామకం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా పోతురాజు బాబు పండగ

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని ఉమ్మలాడ గ్రామంలో మంగళవారం పోతురాజుబాబు పండగ ఘనంగా జరిగింది. ఈ పండగ మహోత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరై పూజలు చేశారు. మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, వైసిపి రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, ఉత్తరాంధ్ర జనసేన పార్టీ ముఖ్య ప్రతినిధి సుందరపు వెంకట సతీష్ తదితరులు పోతురాజు బాబుని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ వారు వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టెక్కలి పరశురాం, దొడ్డి శ్రీనివాసరావు, దాడి ముసలి నాయుడు, మొల్లేటి ఆనంద్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జగన్నాథ స్వామి ఉత్సవాలకు ఏర్పాట్లు

- జూన్ 27 నుంచి జులై 6 వరకు నిర్వహణ

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : అనకాపల్లి పట్టణంలోని గవరపాలెం శ్రీబలభద్ర సుభద్ర సమేత జగన్నాథ స్వామి ఆలయంలో ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. వందేళ్లపైన చరిత్ర కలిగిన ఈ ఆలయంలో ప్రతి ఏడాది ఉత్సవాలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఉత్సవాలు జూన్ 27న ప్రారంభం కాగా, జూలై 6న ముగియనున్నాయి. తొలిరోజు గవరపాలెం నుంచి స్వామివారిని ఊరేగింపుగా గూడ్స్ రోడ్డు సమీపంలోని ఇంద్రజుమ్మ హాలు వద్దకు తీసుకెళ్తారు. అక్కడ తొమ్మిది రోజులు పాటు రోజుకో అవతారంలో భక్తులకు స్వామివారు దర్శనం ఇస్తారు. జులై 6న స్వామివారి తిరుగు రథయాత్రతో ఉత్సవం ముగియనుంది. భక్తుల రద్దీకి అనుగుణంగా భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ దాడి బుజ్జి తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మూడు రోజులు పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ ఉత్సవం తరువాత ఆలయంలో దాదాపు కోటి రూపాయలతో కళ్యాణ మండపం, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం, గుడి ఆధునికీకరణ చేసేందుకు డిజైన్ చేశామని, దీనికి జనసేన నియోజకవర్గం ఇన్‌ఛార్జి రాంకీ సహకరించడంతో నిధులు సమకూరినట్లు చెప్పారు.

పరిహారం ఇవ్వకుంటే పనులు అడ్డుకుంటాం

- ఆరో రోజుకు అమలాపురం మత్స్యకారుల ఆందోళన
- సిపిఎం నేతల సంఘీభావం

ఆందోళన చేస్తున్న మత్స్యకారులు, సిపిఎం నేత అప్పలరాజు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలో వేంపాడు రెవెన్యూ అమలాపురంలో కనకమహాలక్ష్మి ఫిషర్మెన్ కోఆపరేటివ్ సొసైటీకి లీజుకు ఇచ్చిన భూమికి పరిహారం చెల్లించకుండా పనులు చేపడితే అడ్డుకుంటామని మత్స్యకారులు ముక్తకంఠంతో తెల్చి చెప్పారు.దీనికి నిరసనగా మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత ధర్నా మంగళవారం ఆరవ రోజుకు చేరింది. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు మత్స్యకారుల ధర్నాకు మద్దతు తెలిపి, ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అప్పలరాజుతో కలిసి మత్స్యకారులంతా ఐక్యంగా కదిలి బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటు కొరకు చేపడుతున్న రహదారి పనులు చేపడుతున్న ప్రాంతానికి వెళ్లి, పరిహారం చెల్లించాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. తమకు పరిహారం చెల్లించే వరకు ఎటువంటి పనులు చేపట్టొద్దని సంబంధిత గుత్తేదారులు, సూపర్వైజర్లకు తెలియజేశారు. సొసైటీ భూములకు నష్ట పరిహారం చెల్లిస్తామని, రోడ్డు పనులు అడ్డుకోవద్దని మొదట్లో తమకు నర్సీపట్నం ఆర్‌డిఒ,నక్కపల్లి తమశీల్దార్ హామీ ఇచ్చారని, అధికారుల మాటలు నమ్మి, ఇంతవరకు రహదారి పనులను అడ్డుకోలేదన్నారు. నెలలు గడుస్తున్న పరిహారం చెల్లించకపోవడంతో గత్యంతరం లేక ఆందోళన బాట పట్టామని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఎన్ఎఒబి నిర్మాణంలో నష్టపోయిన మత్స్యకార సొసైటీ భూములకు రాంబిల్లి మండలంలో వాడ నరసాపురం, కొత్తపట్నం, ఎస్ .రాయవరం మండలంలో బంగారమ్మపాలెం గ్రామాలలో నష్ట పరిహారం చెల్లించారని, నక్కపల్లి మండలంలో వైజాగ్ -చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో సేకరించిన తమ సొసైటీ భూములకు ఎందుకు పరిహారం చెల్లించడం లేదని ప్రశ్నించారు.

పరిశ్రమలు, అభివృద్ధి పేరుతో తామంతా వేట చేసుకునే ఉప్పుటేరును సైతం ప్రభుత్వం స్వాధీనపరుచు కుంటుందని, సముద్రంలోకి వేటకు వెళ్లే అవకాశం లేకుండా చేస్తుందన్నారు. ఆర్సెలర్ మిట్టల్ , నిప్పల్ స్టీల్ ప్లాంట్‌కు డిఎల్ పురం నుంచి ఇరువైపులా మూడు కిలోమీటర్ల సముద్ర తీరం పోర్ట్ ఏర్పాటు చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 3వ తేదీన అనుమతి ఇచ్చిందని దీని కారణంగా భవిష్యత్తులో సముద్రతీరంలో వేట చేసే అవకాశం లేకుండా పోతుందని మత్స్యకారులు ఆవేదన వెలబుచ్చారు. దీనిపై ఆరు రోజులుగా ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వము గానీ,అధికారులు గానీ స్పందించకపోవడం చాలా అన్యాయమన్నారు. సొసైటీ భూములకు పరిహారం, ఉపాధి కోల్పోయిన మత్స్యకారులు, ప్రజలకు ప్యాకేజీ చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మత్స్యకారులు, మత్స్యకార మహిళలు పాల్గొన్నారు

మట్టి అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు

ఫిర్యాదు చేస్తున్న ఫిషర్‌మేన్ సొసైటీ సభ్యులు

ప్రజాశక్తి -పాయకరావుపేట :మండలంలోని శ్రీరాంపురంలోని పెద్ద చెరువులో అక్రమంగా జరుగుతోన్న మట్టి తవ్వకాలను మంగళవారం ఇన్‌లాండ్ ఫిషరమేన్ కో ఆపరేటివ్ సొసైటీ సభ్యులు అడ్డుకున్నారు. అనంతరం తహాశీల్దారు, పాయకరావుపేట సిఐ, ఇరిగేషన్, ఫిషరీస్ అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఎస్ నర్సాపురం గ్రామానికి చెందిన మంచాల గాంధీ జెసిబి, లారీలతో చెరువుల్లోని మట్టిని తరలించుకు పోతున్నాడని ఫిర్యాదు చేశారు

. ఈ చెరువుకు ఏటా రూ. 60 వేలువరకు ప్రభుత్వానికి లీజు సొమ్ము చెల్లిస్తున్నామని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై మంచాల గాంధీని ప్రశ్నిస్తే మట్టి తవ్వకాలకు తహాశీల్దారు తమకు అనుమతులు మంజూరు చేశారని అబద్దాలు చెబుతున్నాడని ఆరోపించారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి అక్రమ మట్టి తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో సొసైటీ అధ్యక్ష, కార్యదర్శిలు వాసంశెట్టి శేషారావు, మేడిశెట్టి పెంటారావు , సిపిఎం నాయకులు బత్తిన నాగేశ్వరరావు, చింతాకుల దార ఉన్నారు.

అర్హులందరికీ పింఛన్లు ఇవ్వాలి

ప్రజాశక్తి -చీడికాడ : కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన వారందరికీ పింఛన్లు మంజూరు చేయాలని మండలం వైసిపిమండల కన్వీనర్ గొల్లవెల్లి రాజబాబు కోరారు మంగళవారం చీడికాడ గ్రామ వైసిపి అధ్యక్షుడు పరవాడ మహేష్ అధ్యక్షతన ఇంటి వద్ద నిర్వహించిన సమావేశంలో రాజబాబు మాట్లాడుతూ భర్త చనిపోయిన మరుసి నెలనుంచే అతని భార్యకు వితంతు పింఛను మంజూరు చేస్తామని హామీ ఇచ్చి, ఇపుడు మాటా మార్చారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపిపి జయమ్మ , పరవాడ అప్పారావు శేషు చైతన్య పాట రమణ కార్యకర్తలు పాల్గొన్నారు

ఘనంగా మోదకొండమ్మ పండగ

ప్రజాశక్తి- రావికమతం: మండల కేంద్రంలో ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలోని మోదకొండమ్మ పండగ మంగళవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు తెల్లవారుజామునుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు.. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ తగు ఏర్పాట్లను చేసింది.

అంగన్వాడీ కేంద్రాల సందర్శన

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడి కేంద్రాలను సంస్థ పీడీ ఎన్ సూర్యలక్ష్మి మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లోని రికార్డులను పరిశీలించారు. ఆహార పదార్థాల స్టాక్‌లను వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీలో పిల్లలకు అందిస్తున్న ఆహారం పరిశీలించారు. బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. నర్సీపట్నం సిడిపిఒ జివి.రమణి పాల్గొన్నారు.

రంగురాళ్ల తవ్వకాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-గొలుగొండ : నిషేధిత రంగురాళ్ల తవ్వకాలకు దూరంగా ఉండాలని నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ అన్నారు. మంగళవారం గొలుగొండ మండలం కరక గ్రామంలో అటవీశాఖ అధికారులతో కలిసి గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఎవరైనా నిషేదిత అటవీ ప్రాంతంలో అక్రమంగా ప్రవేశించి రంగురాళ్ల తవ్వకాలకు పాల్పడినా, తవ్వకాలకు నేరుగా లేదా పరోక్షంగా సహకరించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. చట్టాలను గౌరవించి అటవీ సంపదను పరిరక్షించడంలో భాగస్వాములు కావాలని కోరారు.కార్యక్రమంలో ఎస్సై రామారావు, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐ రేవతమ్మ

అసంపూర్తి డైనింగ్ హాల్‌కు నిధులు

ప్రజాశక్తి-కోటవురట్ల :మండలంలోని పాములవాక జిల్లా పరిషత్ పాఠశాలలో అసంపూర్తిగా నిలిచిపోయిన కిచెన్, డైనింగ్ హాల్‌కు గెయిల్ కంపెనీ సిఎస్ఆర్ నిధులు రూ.22 లక్షల మంజూరయ్యాయి. దీంతో మంగళవారం వైసిపి మండల అధ్యక్షులు శ్రీనివాసరావు, గెయిల్ ప్రతినిధులతో కలిసి అసంపూర్తి నిర్మాణాన్ని పంచాయతీరాజ్ ఇంజనీర్ వర్మ పరిశీలించారు, త్వరలో టెండర్ ప్రక్రియ చేపడతామని గెయిల్ ప్రతినిధులు తెలిపారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి- మాడుగుల : స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ, మరమ్మతుల దృష్ట్యా ఈనెల 25న బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ విభాగం ఇఇ అప్పారావు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందన్నారు.

నీటి తీరువా వసూళ్లపై నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి -కోటవురట్ల : నీటి తీరువా పన్నులు వసూలుపై నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని తహసిల్దార్ తిరుమలబాబు అన్నారు. మంగళవారం మండల రెవెన్యూ కార్యాలయంలో సమావేశంలో మాట్లాడుతూ, నిర్దేశించిన లక్ష్యాన్ని ప్రతి ఒక్కరూ చేరుకోవాలన్నారు. రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. గత ప్రభుత్వంలో మంజూరైన కాలనీ ఇళ్ల స్థలాలు ఆక్రమణకు గురికాకుండా పర్యవేక్షించా లన్నారు. రీ సర్వే ఫిర్యాదులను పరిష్కరించా లన్నారు, కార్యక్రమంలో డిటి రమేష్, రిసర్వే డీటీ వీరభద్ర చారి, ఆర్ఐ మణికంఠ, గ్రామ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

కవగుంటలోఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - రావికమతం: మండలంలో కవగుంట గ్రామంలో సర్పంచ్ దాసరి సూర్యకుమారి ఆధ్వర్యంలో స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ నళినీ పుష్పలత ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 45 మంది రోగులకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామాల్లో మధుమేహం, అధికరక్తపోటు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ప్రతినెలా వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు అందజేస్తారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలు ప్రయివేటు వైద్యాన్ని ఆర్థికంగా నష్టపోకుండా ప్రభుత్వపరంగా వైద్యసేవలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సురేష్, ఆశలు రాము, నూకరత్నం, మహేష్ సిబ్బంది పాల్గొన్నారు

రమణను పరామర్శించిన ధనిశెట్టి

ప్రజాశక్తి-పాయకరావుపేట:: మండలంలోని అరట్లకోట గ్రామ వైసిపి అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు తూము రమణను ఆ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు మంగళవారం పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై, చికిత్స అనంతరం ఇంటి వద్ద రమణ కోలుకుంటున్న విషయం తెలుసుకుని, వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. వైసిపి నాయకులు ఫిరాది రాజు పాల్గొన్నారు.

చోద్యం వైసిపి గ్రామ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-గొలుగొండ : నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ ఆదేశాల మేరకు గొలుగొండ మండలం చోద్యం వైసిపి గ్రామ కమిటీల ఎన్నిక సోమవారం జరిగింది. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పోతల సత్యనారాయణ, గ్రామ యువజన విభాగం అధ్యక్షుడిగా ధనిమిరెడ్డి కొండబాబు, గ్రామ రైతు విభాగం అధ్యక్షుడిగా నాతిరెడ్డి చిన్న అప్పలనాయుడు, గ్రామ మహిళా అధ్యక్షులుగా బండి భవానిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ ఇన్‌చార్జ్, గ్రామ వైసీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మిగులు సీట్లు భర్తీకి 28న ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి- రావికమతం: ఆదర్శ పాఠశాలలో మిగులు సీట్లు భర్తీకి ఈనెల 28న శనివారం ఉదయం 10 గంటలకు మురుపాక ఆదర్శ పాఠశాలలతో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కె. సత్య సునీల్ తెలిపారు. మిగులు సీట్లలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరూ తమ ఒరిజినల్ ఆధార్ కార్డు తీసుకొని పరీక్షకు హాజరు కావాలన్నారు. ఈ విషయాన్ని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గమనించాలని సూచించారు.

రాయితీపై వరి విత్తనాల పంపిణీ

కోటవురట్లలో విత్తనాలను పంపిణీ చేస్తున్న నేతలు

ప్రజాశక్తి -కోటవురట్ల : మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో మంగళవారం వరి విత్తనాలు పంపిణీ చేశారు, మండల వ్యవసాయ శాఖ అధికారి ఆధ్వర్యంలో టిడిపి జిల్లా కార్యదర్శి లాలం కాశీనాయుడు, మండల టిడిపి అధ్యక్షులు పెట్ల లింగన్న నాయుడు పాల్గొని, రైతులకు సబ్సిడీ వరి విత్తనాలు అందజేశారు, సందర్భంగా వ్యవసాయ అధికారిని మాట్లాడుతూ మండలానికి ఆర్ జి ఎల్, యం టి యు, బిపిటి వంటి తొమ్మిది రకాలను 808.6 క్వింటాళ్ల విత్తనాలు వచ్చాయని, అవి అన్ని రైతు సేవ కేంద్రాలలో అందుబాటులో ఉంచామన్నారు, కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు వేచాలపు జనార్ధన్, జానకి శ్రీను, స్థానిక సర్పంచ్ అనిల్ కుమార్, ఎంపిటిసి సభ్యులు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని నరసింగబిల్లి గ్రామ సచివాలయం వద్ద రైతులకు సబ్సిడీపై ప్రభుత్వం సరఫరా చేసిన వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ కొట్టే రాము, జెర్రిపోతుల నూకునాయుడు, వైస్ ప్రెసిడెంట్ బల్ల అప్పలకొండ, మరుపురెడ్డి గిరిబాబు, పులిమంతుల గణేష్, కోన రమణ, తెరపల్లి శ్రీను, కాపుశెట్టి శివ, మజ్జి బాలాజీ పాల్గొన్నారు.

వడ్డాది : మండలంలోని వడ్డాది రైతు సేవా కేంద్రంలో రైతులకు రాయితీపై వరి విత్తనాలను మంగళవారం స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు మంగళవారం పంపిణీ చేశారు. విత్తనాల కొరత లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. స్థానిక వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఆర్జేఎల్, సాంబ మసూరి, సోనా మసూరి, అమర, మార్టేరు సాంబ మసూరి విత్తనాలు 520 బస్తాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విత్తన శుద్ధి మందులు కూడా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కోరుకొండ కామలక్ష్మి సూరప్పారావు, కూటమి నేతలు దొండా సన్యాసిరావు, నరేష్, గిరిబాబు, సయ్యపురెడ్డి శ్రీనివాస్, సిరిగిరిశెట్టి శ్రీరామ్మూర్తి, నానాజీ, తలారి శంకర్, సింగంపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని గర్సింగి, మారేపల్లి, గ్రామాల్లో మంగళవారం రైతులకు వరి విత్తనాలు సర్పంచ్ గూడెపు రాము ఆవుగడ్డ కన్నతల్లి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శరకాన సూర్యనారాయణ, కిల్లి గోవింద, పెద్దాడ ఎరుకునాయుడు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

భూములు ఇచ్చేందుకు ససేమిరా!

• నెల్లిపూడి, వేంపాడు గ్రామసభల్లో అభ్యంతరం వ్యక్తం చేసిన రైతులు

వేంపాడు గ్రామసభలో నినాదాలు చేస్తున్న రైతులు, నాయకులు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలో వేంపాడు, నెల్లిపూడి గ్రామాల్లో టౌన్ షిప్ ఏర్పాటుకు భూములిచ్చేందుకు రైతులు నిరాకరించారు. మంగళవారం తహసిల్దార్ నరసింహామూర్తి ఆధ్వర్యంలో భూసేకరణకు గ్రామసభలు నిర్వహించగా నిర్వాసిత రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. మండలంలో వైజాగ్, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో పరిశ్రమల స్థాపనకు ఆరువేల ఎకరాల భూసేకరణ చేపట్టిన ఎపిఐఐసి అధికారులు, ఇపుడు ఆ బల్క్ డ్రగ్స్ పార్క్, స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికే పరిశ్రమలు ఏర్పాటుకు మౌలిక వసతుల కల్పనలో భాగంగా రహదారి, ఇతర పనులు చురుగ్గా సాగుతున్నాయి. బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటు కొరకు అదనంగా మరో వెయ్యి ఎకరాలు సేకరించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇప్పుడు తాజాగా టౌన్ షిప్ ఏర్పాటు కోసం 437.41ఎకరాల భూసేకరణ పని లో అధికారులు నిమగ్నమయ్యారు. ఉద్దండపురంలో జిరాయితి భూమి 48.63, ప్రభుత్వ భూమి 9.84, నెల్లిపూడిలో జిరాయితి భూమి 103.10, ప్రభుత్వ భూమి 4.80, వేంపాడులో జిరాయితీ భూమి 285.68, ప్రభుత్వ భూమి 14.14 ఎకరాలు, మొత్తం 437.41 ఎకరాలు సేకరణకు మంగళవారం నుండి గ్రామసభలు నిర్వహిస్తున్న నేపథ్యంలో తొలిరోజే రైతుల నుంచి అభ్యంతరం వ్యక్తమైంది. మండలంలో. ఇప్పటికే భూములు ఇచ్చి చుట్టుపక్కల గ్రామాల్లో రైతులందరూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. నెల్లిపూడి గ్రామంలో వైసిపి నేత, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, సర్పంచ్ సురేష్ వర్మ రైతులతో కలిసి భూములు ఇచ్చేది లేదని, భూ సేకరణ చేపట్టొద్దని కోరుతూ తహసిల్దార్ నరసింహామూర్తికి వినతి పత్రాన్ని అందజేశారు.

నెల్లిపూడి గ్రామసభలో తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేత

వేంపాడులో నిరసన

వేంపాడు గ్రామంలో ఏపీఐఐసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనిత, తహసిల్దార్ నరసింహామూర్తి కొరకు గ్రామసభ నిర్వహించగా భూములు ఇచ్చేది లేదని రైతులు, నాయకులు ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. భూసేకరణ వ్యతిరేకిస్తూ సర్పంచ్ నూకరత్నం, ఉప సర్పంచ్ అప్పలరాజు, జనసేన నాయకులు గెడ్డం బుజ్జి, వైసీపీ నాయకులు అయినంపూడి మణిరాజు, సూరకాసుల గోవింద్, మాజీ ఎంపీటీసీ సభ్యులు గింజాల వెంకటరమణ తదితరులు వినతిపత్రం అందజేశారు.

బాధిత కుటుంబానికి పరిహారం

పరిహారం చెక్కును అందజేస్తున్న స్పీకర్ అయ్యన్న

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : అడవిపంది దాడిలో మృతి చెందిన నాతవరం మండలం శృంగవరం గ్రామానికి చెందిన నీలి నాగేశ్వరరావు కుటుంబానికి అటవీశాఖ ద్వారా రూ.పది లక్షల పరిహారం మంజూరుకాగా, మంగళవారం బాధిత కుటుంబానికి అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అందజేశారు. గతేడాది నవంబర్ 26న పొలం పనికి వెళ్లిన నీలి నాగేశ్వరరావుపై అడవి పంది దాడి చేయడంతో మృతి చెందాడు. దీనిపై స్పందించిన అటవీ శాఖ అధికారులు బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుండి రూ.10 లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఈ పరిహారాన్ని మృతుని కుమారులు వీర సత్యనారాయణ, శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్‌లకు మంగళవారం నర్సీపట్నం స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో అయ్యన్నపాత్రుడు అందజేశారు పరిహారంలో సగాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్‌గా, మిగిలిన 50 శాతం నగదు చెక్కుల రూపంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిఎఫ్ఒఎమ్. శామ్యూల్, ఎఫ్ఆర్ఒ పి. లక్ష్మీనరసు, గ్రామ టిడిపి నాయకులు, తాండవ నీటి సంఘం-2 ప్రెసిడెంట్ ఉలబాల బాపిరాజు పాల్గొన్నారు.

కృష్ణదేవిపేట పిహెచ్‌సి వైద్యాధికారిణిగా జ్యోతి

డాక్టర్ జ్యోతి

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని కృష్ణదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరో వైద్యాధికారిణిగా సీహెచ్.జ్యోతి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం జిల్లాలో వంగర పీహెచ్‌సి నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. గతంలో పనిచేసిన డాక్టర్ ఎన్.హరిప్రవీణ్ ఉన్నత చదువులకై వెళ్లారు. మూడు నెలలుగా మరో వైద్యాధికారి పోస్టు ఖాళీతో ఉండటంతో జిల్లా ఉన్నతాధికారులు ఈ మేరకు నియామకం చేపట్టడంతో రోగులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మలేరియా నిర్మూలనపై అవగాహనా ర్యాలీ

అవగాహనా ర్యాలీలో పాల్గొన్న డాక్టర్, సర్పంచ్

ప్రజాశక్తి- రావికమతం: మలేరియా మనతోనే అంతం కావాలని, దానికి ప్రతిఒక్కరి సహకారం అవసరమని స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ నళిని పుష్పలత అన్నారు. మంగళవారం మలేరియా నివారణ మాసోత్సవాలలో భాగంగా మండలంలో కవగుంట గ్రామంలో సర్పంచ్ దాసరి సూర్యకుమారి ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సూర్యకుమారి మాట్లాడుతూ, దోమల నివారణతోనే సీజనల్‌గా ప్రబలే మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధులు దరిచేరకుండా చేయొచ్చన్నారు. ప్రతిఇంటా దోమలు, వాటి లార్వాలకు ఆవాసమైన నీరు నిల్వ లేకుండా చేయాలన్నారు. వైద్యాధికారిణి బి. నళిని పుష్పలత మాట్లాడుతూ అనారోగ్య సమస్య వస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీప ఆరోగ్యకేంద్రానికి వచ్చిన వైద్యసేవలు పొందాలన్నారు. దోమలు విజృంభించకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు దోమ తెరలను వాడాలన్నారు. ఆహారజాగ్రత్తలు తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు.కార్యక్రమంలో సిహెచ్ఒ హేమ సుందర్, హెల్త్ అసిస్టెంట్ సురేష్, ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం శైలజ, ఆశాలు నూకరత్నం, రాము పాల్గొన్నారు .

పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేయండి

తహశీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న ఈదటం గ్రామ రైతులు

ప్రజాశక్తి - పాయకరావుపేట: తమ భూములను పూర్తి స్థాయిలో సర్వే చేసి, పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని మండలంలోని ఈదటం గ్రామ రైతులు కోరారు. మంగళవారం తహశీల్దారు జి ఆనందరావుకు వినతిపత్రం అందజేశారు. ఈదటం గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్లు 284,285, 286లోని భూములను 40ఏళ్ల క్రితం పాల్మెన్ ఎట, రాజయ్యపేట, కొర్లయ్య పేట గ్రామాల్లోని తమకు మంజూరు చేసి, ప్రభుత్వం పట్టాదారు పసుపుస్తకాలు ఇచ్చిందన్నారు. ఈ మేరకు తమకు ప్రభుత్వ పథకాలతోపాటు రైతుభరోసా ఆర్థికసాయం కూడా అందుతోందన్నారు అయితే తమలో కొందరికి పట్టాదారు పసుపుస్తకాలు మంజూరుకాకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ లబ్ధికి నోచుకోని పరిస్థితి ఉందన్నారు. ప్రస్తుతం తమ గ్రామంలోని భూములను రెవెన్యూ అధికారులు రీ సర్వే చేస్తున్న నేపథ్యంలో తమకిచ్చిన భూములను కూడా పూర్తి స్థాయిలో రీ సర్వే చేసి, పట్టాదారు పాసుపుస్తకాలు లేనివారికి మంజురు చేయాలని తహశీల్దారు ఆనందరావును కోరారు.కార్యక్రమంలో గోగాడ జోగిబాబు, నేలపాటి గోపాలకృష్ణ, గంపల రాంబాబు, గాతాడ పెద్దిరాజు, బోడపాటి రమేష్, మేకా పెద్దింట్లు, గోగాడ నాగేశ్వరావు, గాతాడ సత్యనారాయణ, కోట అప్పలరాజు, మామిడి గొల్లబాబు, నడిపల్లి నాగేంద్ర పాల్గొన్నారు.

కెజిబివి ఆకస్మిక తనిఖీ

విద్యార్థులతో మాట్లాడుతున్న డిసిడిఒ

ప్రజాశక్తి -నక్కపల్లి : నక్కపల్లి కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాన్ని మంగళవారం డిసిడిఒ జమీమా తనిఖీ చేశారు. తరగతి గదులు, స్టోర్ రూమును పరిశీలించారు. స్టాకును పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి, విద్యా బోధన గురించి అడిగి తెలుసుకున్నారు ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు

ఉద్యోగ భద్రత కల్పించాలి

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరరావు : ఆరో రోజున దీక్షలకు సంఘీభావం

మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరరావు

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల డిమాండ్లను తక్షణమే నెరవేర్చి, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జి కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారానికి మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు స్థానిక ఆర్‌డిఒకార్యాలయం ఎదుట చేపడుతున్న నిరసన దీక్షలు మంగళవారం ఆరోరోజుకు చేరిన సందర్భంగా దీక్షా శిబిరాన్ని సందర్శించారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల పోరాటానికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ఏళ్ల తరబడి మున్సిపాల్టీల్లో తాగునీరు, విద్యుత్, తదితర విభాగాల్లో పనులు చేస్తున్న ఇంజినీరింగు కార్మికులకు కనీసవేతనాలు అమలు కావడం లేదన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వీరికి వర్తింపజేయడం లేదన్నారు. నిత్యవసరాలు, ఇతరత్రా ధరలు మండిపోవడం తో పాటు సొంతిళ్లు లేని పరిస్థితుల్లో అద్దింట్లో ఉంటూ అరకొర వేతనాలతో కుటుంబపోషణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ పిల్లలకు నాణ్యమైన ఉన్నతవిద్యను చదివించుకోలేని దుస్థితిలో జీవనం సాగిస్తున్నారన్నారు. ఈనేపథ్యంలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల న్యాయమైన సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టి వాటి పరిష్కార చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఇంజినీరింగ్. కార్మికుల పోరాటానికి సిఐటియు సంపూర్ణ మద్దతునిస్తూ అండగా నిలుస్తుందని భరోసానిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు,యూనియన్ నాయకులు అప్పల నాయుడు, మురళీ, నాయుడు, నాగేంద్ర, దుర్గ, శేఖర్ పాల్గొన్నారు.